మనం

జనం కోసం అక్షర యజ్ఞం...

AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHBUBNAGAR | WARANGAL | KHAMMAM

అమరావతి | సంపుటి: 3 • సంచిక: 34 • పేజీలు: 8+8 • వెల: రూ.5 | శుక్రవారం • 11-1-2019 | www.manamnews.com | /manamnews



ఈబీసీ కోటాపై సుప్రీంలో పిటిషన్

ఆర్థిక స్థితిగతులు రిజర్వేషన్లకు మూలం కాదు

పార్లమెంట్ ఆమోదించిన బిల్లు చెల్లదు

సుప్రీం కోర్టులో కౌశల్ కాంత్ మిశ్రా పిటిషన్



అయోధ్యపై విచారణ వాయిదా

7

కేసు నుంచి తప్పుకొన్న జస్టిస్ లలిత్

మరో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు: ప్రధాన న్యాయమూర్తి



రాజధానిలో ప్రాణ రక్షణ కరువు

గతేడాది పెరిగిన హత్యలు

నివేదిక విడుదల చేసిన ఢిల్లీ పోలీసులు





సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కిక్కిరిసి ఉన్న జనం

ఊరెళ్లేదెలా?

కిటకిటలాడుతున్న రైల్వేస్టేషన్లు.. జేబులు ఖాళీచేస్తున్న బస్‌టికెట్లు

విమానాల్లో వెళ్దామన్నా కష్టమే.. సొంత కార్లే మేలంటున్న జనం

పండుగ దగ్గర పడేకొద్దీ ఆరాటం.. ప్రైవేటు ట్రావెల్స్‌ది ఇష్టారాజ్యం

తనిఖీల ఊసెత్తని అధికారులు.. బ్లాబ్లా కార్లకు పెరిగిన డిమాండ్

హైదరాబాద్, జనవరి 10:

పెద్ద పండగ దగ్గర పడింది. ప్రైవేటు ట్రావెల్స్ లాంటి సంస్థలకు ఇది నిజంగానే పెద్ద పండగలా మారింది. ఒక్కో రైల్లో మూడు నాలుగు రైళ్లకు సరిపడ ప్రయాణికులు ఉండటం, వాటిలో ఎక్కడం దాదాపు అసాధ్యంగా కనిపించడానికి తోడు రిజర్వేషన్లన్నీ ఎప్పుడో ముందుగానే పూర్తయిపోవడం, తత్కాల్‌లో చేయించుకుందామన్నా సెకన్లలోనే అవి అయిపోయి, వెయిటింగ్ లిస్ట్ రావడంతో సంక్రాంతికి ఊళ్లు వెళ్లాలనుకునేవారు తల పట్టుకుంటున్నారు. సంక్రాంతి సీజన్ అనగానే అందరికీ పండగే. కొత్త సినిమాలను విడుదల చేయడానికి ఈ సీజన్నే ఎంచుకుంటారు. అలాగే ప్రతి ఒక్కరూ సొంత ఊళ్లు వెళ్లడానికి సిద్ధం అవుతుండటంతో ఒక్కసారిగా ప్రైవేటు బస్సు చార్జీలకు రెక్కలొచ్చాయి. భారీగా ఉన్న డిమాండును ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు సొమ్ముచేసుకొంటున్నాయి. సంక్రాంతికి మూడునెలల ముందే రైలు టికెట్లు బుక్ అయిపోతాయి. తత్కాల్ టికెట్లు కూడా హాట్‌కేకుల్లా పెట్టిన రెండు మూడు నిమిషాల్లోనే ఖాళీ అయిపోతున్నాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను పెట్టినా.. అవి అంతంతమాత్రంగానే ఉండటం, వాటిలోనూ టికెట్ ధర ఒకటిన్నర రెట్లు ఉండటానికి తోడు.. మామూలు రోజుల్లో సిటీ సర్వీసుగా తిరిగే బస్సులనే స్పెషల్ బస్సుల పేరుతో తిప్పేస్తారు. దాంతో కాస్త రేటు ఎక్కువైనా ప్రైవేటు బస్సులవైపు వెళ్దామని చూస్తే గుండెలు గుభేలుమంటున్నాయి. రూ. 500 ఉండే టికెట్‌ను రూ. 2వేలకు, వెయ్యి రూపాయలుంటే టికెట్‌ను మూడు వేలకు ట్రావెల్స్ సంస్థలు

..మిగతా 2లో



సంక్రాంతి పండుగ వస్తోందంటేనే రంగురంగుల రంగవల్లులు వీధుల నిండా కనిపిస్తాయి. సరిగ్గా అలాంటి పండుగ కళ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కూడా వచ్చింది. అసెంబ్లీలోని మహిళా ఉద్యోగులకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో దృశ్యమిది..



రా రమ్మంటున్న 'ఆతిథ్యం'!

పెట్టుబడులకు అపార అవకాశాలు

మార్కెటింగ్ వ్యూహాలపై పర్యాటక శాఖ దృష్టి

ప్రభుత్వ, ప్రవేటు భాగస్వామ్యమే కీలకం..శుక్లా

3

ఇదీలోకం!



ఇదేంటి సార్.. మేం 20 నిమిషాల ముందు రావాలా.. రైలు మాత్రం రెండు గంటలు లేటా..?



చిన్న వ్యాపారులకు ఊరట

జీఎస్టీ మినహాయింపు పరిమితి రెట్టింపు

5

ఎంఎస్ఎంఈలకు టర్నోవర్ 40 లక్షలు!

రాష్ట్రాలకు నిర్ణయించుకునే అధికారం

కంపోజిషన్ పరిమితి రూ. కోటిన్నర..

జీఎస్టీ మండలి భేటీలో కీలక నిర్ణయాలు

ఇదో అద్భుతం

రాజధాని నిర్మాణం అరుదైన అవకాశం



- సింగపూర్ సహకారం మరువలేం
- సాంకేతికతతో పారదర్శక పాలన
- అవినీతి రహిత రాష్ట్రంగా ఏపీ...
- లింగాయపాలెంలో వెల్కమ్ గ్యాలరీ
- ఈశ్వరన్‌తో కలిసి సీఎం శంకుస్థాపన
- ఇక మా బంధం మరింత పటిష్ఠం
- సింగపూర్ మంత్రి ఈశ్వరన్ వెల్లడి

విజయవాడ, జనవరి 10:

రాజధాని నిర్మాణం ఒక అద్భుతమైన, అరుదైన అవకాశమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం అమరావతి రాజధాని ప్రాంతంలోని లింగాయపాలెంలో వెల్కమ్ గ్యాలరీకి సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వెల్కమ్ గ్యాలరీకి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. స్వల్ప కాలంలోనే

..మిగతా 2లో

వాతావరణం

ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం వాతావరణం కాస్త చల్లబడే అవకాశం ఉంది. చలిగాలులు కూడా ఎక్కువవుతాయి.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 28 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 66 శాతం

గాలి వేగం: గంటకు 18 కి.మీ.

ముహూర్తం

శ్రీ చాంద్రమాన విళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: శుక్లపక్షం, పంచమి సా.4.01 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పూర్వాభాద్ర తె.5.21 వరకు(తెల్లవారితే శనివారం), వర్జ్యం: ఉ.10.05 నుంచి 11.51 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.49 నుంచి 9.33 వరకు, తదుపరి ప.12.30 నుంచి 1.14 వరకు, రాహుకాలం: ఉ.10.30 నుంచి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుంచి 4.30 వరకు, అమృతఘడియలు: రా.8.34 నుంచి 9.45 వరకు

కాలినడకన స్వామి చెంతకు...

తిరుమలలో వెంకన్న దర్శనం చేసుకున్న జగన్

- మెట్ల దారిలో అందరినీ పలకరిస్తూ నడక
- పెద్దసంఖ్యలో వెంట వచ్చిన అభిమానులు
- ఆయన వెంటే రోజా, చెవిరెడ్డి, భూమన..
- మూడున్నర గంటల్లో కొండ పైకి జగన్
- సామాన్య భక్తుడిలా ఆలయంలో దర్శనం



తిరుపతి, జనవరి 10 (మనం న్యూస్‌బ్యూరో):

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి గురువారం కాలి నడకన కొండెక్కి.. తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం

..మిగతా 2లో

అలోక్‌పై వేటు

సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగింపు

- రెండు రోజులే అలోక్ వర్మ పదవి
- మోదీ నేతృత్వంలో కమిటీ నిర్ణయం
- రెండు రోజుల పాటు కమిటీ భేటీ
- చివరకు సాగనంపాలని అభిప్రాయం
- ఈలోపే ఐదుగురు అధికారుల బదిలీ
- పది మంది అధికారుల బదిలీలు రద్దు
- అలోక్ వర్మ సంచలన నిర్ణయాలు



న్యూఢిల్లీ, జనవరి 10:

సుప్రీంకోర్టు తీర్పు పుణ్యమాని సుమారు 48 గంటల పాటు మళ్లీ పాత వైభవాన్ని అనుభవించిన సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను సాగనంపాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని హైపవర్ కమిటీ నిర్ణయించింది. దాంతో ఆయనపై వేటు పడింది. డైరెక్టర్ పదవి నుంచి అలోక్‌వర్మను తక్షణం తప్పించాలని కమిటీ నిర్ణయం

..మిగతా 2లో

చిన్నవ్యాపారులకు ఊరట

న్యూఢిల్లీ, జనవరి 10: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు (ఎంఎస్‌ఎంఈ)లకు జీఎస్టీ విషయంలో పెద్ద ఊరట లభించింది. ఈ రంగంలోని సంస్థలకు జీఎస్టీ మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షల వార్షిక టర్నోవర్‌కు పెంచుతూ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలోని జీఎస్టీ మండలి నిర్ణయం తీసుకుంది. ఈశాన్య, పర్వతప్రాంత రాష్ట్రాలకు జీఎస్టీ మినహాయింపు పరిమితిని ప్రస్తుతమున్న రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచారు. అంటే, ఈ మొత్తం టర్నోవర్ లోపల ఉన్న వ్యాపారస్తులు, చిన్నతరహా వాణిజ్య సంస్థల వాళ్లు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన అవసరం ఉండబోదు. అయితే, ఇందులో వివిధ రాష్ట్రాలు ఎంఎస్‌ఎంఈలకు జీఎస్టీ పరిమితిని రూ. 20 లక్షలుగానే ఉంచుకోవాలా, లేదా రూ. 40 లక్షలకు పెంచాలా అనే విషయంలో వారి నిర్ణయం వారు తీసుకోవచ్చు. ఆ అధికారాన్ని రాష్ట్రాలకు కల్పించారు. 2016 నవంబరు నెలలో పెద్ద నోట్ల రద్దుతో ఒక్కసారిగా కుదేలైన చిన్న తరహా వ్యాపార, వాణిజ్య సంస్థలకు జీఎస్టీ ప్రవేశపెట్టడంతో మరింత భారం మోపినట్లయింది. జనవరి ఒకటోతేదీన ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పరిమితిని రూ. 75 లక్షలకు పెంచాలన్న యోచనలో తమ ప్రభుత్వం ఉన్నట్లు చెప్పారు. అయితే ప్రస్తుతానికి రూ. 40 లక్షలతో సరిపెట్టారు. కంపోజిషన్ పథకంలో కూడా భారీగా మార్పులు తెస్తూ.. ప్రస్తుతమున్న టర్నోవర్ పరిమితి రూ.కోటిని రూ. కోటిన్నరకు పెంచారు. అలాగే రూ. 50 లక్షల లోపు టర్నోవర్ ఉన్న సర్వీసు ప్రొవైడర్లు ఇపుడు 6% రేటుకే కంపోజిషన్ పథకాన్ని ఉపయోగించుకోవచ్చు. ఈ పథకాన్ని ఉపయోగించుకునేవాళ్లు మూడునెలలకోసారి పన్నులు చెల్లించి, రిటర్నులను మాత్రం ఏడాదికోసారి ఫైల్ చేయచ్చు. కేరళ రాష్ట్రంలో గరిష్ఠంగా రెండేళ్ల పాటు అంతర్రాష్ట్ర అమ్మకాల మీద 1% విపత్తు సెస్ విధించేందుకు కూడా జీఎస్టీ మండలి ఆమోదం తెలిపింది. రియల్ ఎస్టేట్, లాటరీలపై ఏకరీతి పన్ను లాంటి వివాదాస్పద అంశాలపై రెండు మంత్రుల బృందాలను ఏర్పాటుచేసి ఏకాభిప్రాయ సాధనకు కృషి చేస్తున్నారు. మరో రెండు మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశం కనిపిస్తుండటంతో వినియోగదారులు, చిన్న వ్యాపారవేత్తలకు ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాలలో 10% రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకోగా తాజాగా జీఎస్టీ పరిమితిని పెంచుతూ చిన్న వ్యాపారులకు మేలు చేసింది. దాంతోపాటు.. ఎంఎస్‌ఎంఈలకు 59 నిమిషాల్లో రుణాలు మంజూరు చేయడం, ఎన్‌పీఎస్ వినియోగదారులకు పన్ను మినహాయింపు, 22 రకాల వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించడం, వివిధ రిటర్ను ఫారాలు దాఖలు చేసేందుకు తుది గడువును పెంచడం, ఉల్లి ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు, ఆన్‌లైన్ మార్కెట్లలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నియంత్రించడం ద్వారా చిన్న వ్యాపారులను రక్షించడం లాంటి చర్యలు చకచకా తీసుకుంటోంది. ఇవన్నీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవేనని ఒకవైపు విమర్శలు వినిపిస్తున్నా, చిన్న వ్యాపారులు, పేద వర్గాల వారికి మాత్రం ఎంతోకొంత ఊరట లభించిందని అంటున్నారు.

కథానాయకుడు అద్భుతం

- ప్రశంసించిన స్పీకర్ కోడెల

అమరావతి, జనవరి 10: ఎన్టీఆర్ బయోపిక్ చిత్రం కథానాయకుడు అద్భుతంగా ఉందని స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు ప్రశంసించారు. గుంటూరులో ఆయన ఈ చిత్రాన్ని చూశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సినిమా అద్భుతంగా ఉందని, వాస్తవాలకు ప్రతిరూపంగా ఉందన్నారు. వాస్తవాలను వక్రీకరించకుండా కళ్లకు కట్టినట్లు దర్శకుడు క్రిష్ చూపించారని ప్రశంసించారు. బాలకృష్ణ అద్భుత నటనతో ఎన్టీఆర్‌ను మళ్లీ చూసినట్లయిందని చెప్పారు. చిత్రంలోని నటీనటులు అద్భుతంగా నటించారని ప్రశంసించారు. కాగా, ఈ నెల 18న సీఎం పర్యటన నేపథ్యంలో చెరువు, వావిలాల ఘాట్, పార్క్, ఎన్టీయార్ విగ్రహం అభివృద్ధి పనులు స్పీకర్ పరిశీలించారు. 15నాటికి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 26వ వార్డులో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో స్పీకర్ పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే ఈబీసీ బిల్లు

- **పార్లమెంట్ ఆమోదించడం ఆశ్చర్యకరం: కేఏ పాల్**

అమరావతి, జనవరి 10: ఈబీసీని బిల్లును కేంద్ర ప్రభుత్వం ఎన్నికలను ఉద్దేశించే తీసుకువచ్చిందని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆరోపించారు. ఈ బిల్లును పార్లమెంట్‌లోని ఉభయసభలు ఆమోదించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఈబీసీలు గత నాలుగేళ్లుగా గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. ఇది ఎన్నికల ఎత్తుగడేనని పేర్కొన్నారు. నరేంద్రమోదీ మరోసారి ప్రధాని అవడం పగటికలేనని అన్నారు. విశ్వహిందూ పరిషత్తు, భజరంగ్ దళ్ సంస్థలు 58 లక్షల మంది రాడికల్ గ్రూప్‌లను తయారు చేస్తున్నాయని ఆరోపించారు. జగన్‌నుకానీ.. చంద్రబాబును కానీ గెలిపిస్తే బీజేపీని గెలిపించినట్టేనని చెప్పారు. 99 శాతం మంది హిందువులు సెక్యులర్‌వాదులన్నారు. ప్రజాశాంతి పార్టీలో 60 వేల మంది యువతను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలోకి వెయ్యి మందిని చేర్పించిన వారికి నెలకు రూ.3వేల భృతి ఇస్తామని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లలో హైదరాబాద్‌కు దీటుగా విజయవాడను తీర్చిదిద్దుతానని చెప్పారు.

జీఎస్టీపై రాష్ట్ర అభ్యంతరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం

- **జీఎస్టీ కౌన్సిల్ భేటీ అనంతరం మంత్రి యనమల**

న్యూఢిల్లీ, జనవరి 10: జీఎస్టీపై రాష్ట్రానికున్న అభ్యంతరాలను జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో వెల్లడించినట్టు రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణ వివరించారు. ఢిల్లీలో జరిగిన 32వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి అజెండా ఖరారు చేయడంలో సైతం రాష్ట్రాలను కేంద్రం పరిగణలోకి తీసుకోవడం లేదని ఆయన వాపోయారు. కేంద్రం అనుకున్న వస్తువులనే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకొస్తుండడంతో.. రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతిపాదనలు చర్చకు రావడం లేదన్నారు. దీంతో తదుపరి సమావేశాలకు రాష్ట్రాల ప్రతిపాదనలు తీసుకొని అజెండా ఖరారు చేయనున్నట్టు అరుణ్ జైట్లీ చెప్పారన్నారు. ఈ సమావేశంలో రియల్ ఎస్టేట్ కు సంబంధించి చర్చ జరిగింది. ఏపీ నుంచి రియల్ ఎస్టేట్‌కు సంబంధించి చేస్తున్న డిమాండ్‌లే ఫిట్‌మెంట్ కమిటీ ప్రతిపాదించిందన్నారు.

గయలో ఉద్రిక్తత

- **బాలిక తల నరికిన కామాంధులు.. ఆందోళన**

పట్నా, జనవరి 10: బిహార్‌లోని గయ అట్టుడుకుతోంది. భారీ నిరసనలతో గయలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తల తెగి పడి ఉన్న ఓ 16 ఏళ్ల మైనర్ అమ్మాయి మరణంతో ఇక్కడ శాంతిభద్రతలు అదుపుతప్పాయి. అమ్మాయి ముఖాన్ని యాసిడ్ పోసి కాల్చినట్టు, యదపై కూడా లోతైన గాయాలుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. తమ కుమార్తెపై అత్యాచారం జరిపి క్రూరంగా చంపేసినట్టు బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ ఇదో పరువుహత్య అంటూ పోలీసులు పేర్కొంటున్నారు. పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారంటూ ఖాకీలపై స్థానికులు రెచ్చిపోతున్నారు. గత నెల 28 నుంచి ఈ టీనేజర్ కనిపించకుండా పోయింది. కుళ్లిపోయిన ఆమె శవం ఈనెల 6న లభించింది. తమ కుమార్తె తప్పిపోయిందంటూ ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని కుటుంబం ఆరోపిస్తోంది.

ఊరెళ్లేదెలా?



(మొదటి పేజీ తరువాయి)

పెంచేశాయి. బెంగళూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకు వెళ్లాలంటే దాదాపు రెండున్నర వేల రూపాయలు పెట్టాల్సి వస్తోంది. పెంచిన ధరలను ఆయా సంస్థల వెబ్‌సైట్లలో బహిరంగంగానే పెడుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు.. విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి.. గోదావరి జిల్లాలలకు పెద్దఎత్తున జనం బయలుదేరతారు. సంక్రాంతి సీజన్ వచ్చిందంటే హైదరాబాద్ నగరం సగానికి పైగా ఖాళీ అయిపోతూనే ఉంది. కానీ ఈ డిమాండుకు తగినట్లుగా ప్రభుత్వరంగ రవాణా వ్యవస్థ లేకపోవడంతో తప్పనిసరిగా ప్రైవేటువైపు చూడాల్సి వస్తోంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు సాధారణంగా రూ. 300–400 మధ్య ఉండే టికెట్ ఇప్పుడు 1000–1500 మధ్య పలుకుతోంది. ఏసీ బస్సు టిక్కెట్ ధర రూ.700 నుంచి 2000కు చేరింది. ఇంత పెద్ద మొత్తం చెల్లించి టికెట్ కొన్నా బస్సులు సకాలంలో గమ్యం చేరతాయన్న గ్యారెంటీ లేకపోవడం ప్రయాణికులను కలవరపరుస్తోంది. ప్రైవేటు బస్సు యాజమాన్యాలు పాత బస్సులను రోడ్డు మీదకు తేవడం.. అవి మధ్యలోనే ఆగిపోవడం ప్రతి సీజన్‌లోనూ కనిపించే తతంగమే. గతంలో ఇలాంటి సీజన్‌లలో తనిఖీలు చేసే రవాణా శాఖాధికారులు ఇప్పుడు ఆ దిశగా ప్రయత్నాలేమీ చేయడం లేదు. అధికార పార్టీకి చెందిన నేతలకే పలు ట్రావెల్స్ సంస్థలు ఉండటం వల్లే అధికారులు ప్రైవేటుబస్సుల జోలికి వెళ్లే సాహసం చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విమానాల టికెట్లు చుక్కల్లోనే..

సాధారణంగా వారం, పది రోజుల ముందు బుక్ చేసుకుంటే విమాన టికెట్ల ధరలు కాస్తలో కాస్త అందుబాటులోనే కనిపిస్తాయి. కానీ ఇప్పుడు మాత్రం సీజన్‌ను సొమ్ము చేసుకోవడంలో విమానయాన సంస్థలు అందరికంటే ముందున్నాయి. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి విమాన టికెట్ రూ. 15 వేల నుంచి 25 వేల మధ్య పలుకుతోంది. జనవరి 12 నుంచి 14వ తేదీ వరకు కనీసం రూ. 14,700కు తక్కువ టికెట్లే లేవు.

బ్లాబ్లా కార్లకు డిమాండ్

కొద్దిలో కొద్ది బ్లాబ్లా కార్ లాంటి కార్ పూలింగ్ సైట్లు చాలావరకు నయంగా కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు పండుగ సీజన్‌లో కూడా ఒక సీటుకు 700–950 వరకు చార్జీ ఉంటోంది. కారు మోడల్, అందులో ఉండే సౌకర్యాలను బట్టి సాధారణంగా కొంత రేటు పెంచుతారు తప్ప.. మరీ ఎక్కువగా అయితే ఉండదు. దానికితోడు సాధారణంగా అన్ని కార్లలోనూ ఏసీ తప్పనిసరిగా ఉంటుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు అయితే రూ. వెయ్యి నుంచి 1500 వరకు ఉంటోంది. సాధారణంగా సొంత కార్లు తీసుకుని ఊళ్లకు బయల్దేరేవాళ్లు తాము ఒక్కరం వెళ్లడం ఎందుకని ఇలా కార్‌పూలింగ్ ఆఫర్ చేస్తారు. బస్సు టికెట్లతో పోలిస్తే దీని ధర తక్కువగా ఉండటం, సులభంగా వెళ్లే అవకాశం ఉండటంతో ఎక్కువమంది వీటివైపు మొగ్గు చూపిస్తున్నారు.

అలోక్‌పై వేటు

(మొదటి పేజీ తరువాయి)



తీసుకుంది. లోక్‌సభలో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకుడు, ప్రధాన న్యాయమూర్తి సభ్యులుగా ఉండే ఈ కమిటీకి కాంగ్రెస్ నుంచి మల్లికార్జున ఖర్గే రాగా.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ బదులుగా ఆయన పంపిన ప్రతినిధి జస్టిస్ ఏకే సిక్రీ హాజరయ్యారు. అలోక్‌వర్మ మీద వచ్చిన ఆరోపణలు.. వాటిపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ విచారణ తదితర అంశాలపై రెండు రోజుల పాటు ముమ్మరంగా చర్చించిన ఈ కమిటీ.. ఆయనను ఆ పదవి నుంచి తప్పించడమే సబబని భావించింది. సుప్రీంకోర్టు కూడా అలోక్ వర్మను సీబీఐ డైరెక్టర్ పదవిలో నియమించాలని చెప్పినా, ఈ కమిటీ నిర్ణయాన్ని బట్టే ఆయనను ఉంచాలా.. దించాలా అనేది ఉంటుందని స్పష్టం చేసింది. దాంతో ఇక అలోక్ వర్మకు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. అయితే... రెండు రోజుల పాటు సీబీఐ డైరెక్టర్ పదవిని అనుభవించిన అలోక్ వర్మ.. వెంటనే చాలా పనులు చేసేశారు. తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు చేసిన బదిలీలలో ఒక్కటి తప్ప మిగిలిన అన్నింటినీ.. అంటే సుమారు 10 వరకు బదిలీలను రద్దు చేశారు. దాంతోపాటు కొత్తగా ఐదుగురు అధికారులను బదిలీ చేశారు. ఆయన రద్దు చేసిన బదిలీ ఉత్తర్వులలో చాలావరకు అక్టోబరు 23న జారీ అయ్యాయి. కొన్ని ఈ నెల ఆరంభంలో జారీ అయ్యాయి. సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా కేసును విచారిస్తున్న అధికారులలో కొందరిని కూడా బదిలీ చేశారు. సాధారణంగా సీబీఐ లాంటి సంస్థలలో బదిలీలను విధాన నిర్ణయాలుగా కాకుండా.. పరిపాలనాపరమైన నిర్ణయాలుగా భావిస్తారు. అలోక్‌వర్మ ఇలా బదిలీ రద్దు చేసినవారిలో గుజరాత్ కేడర్ 1987 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఏకే శర్మ కూడా ఒకరు. ఆయన అత్యంత కీలకమైన విధాన డివిజన్ బాధ్యతలు చూస్తున్నారు. అంతకు ముందు నాగేశ్వరరావు బదిలీ చేసిన 13 మంది అధికారులు వర్మ వద్దకు వచ్చి.. తమ బదిలీ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. వారిలో డీఐజీ ఎంకే సిన్హా, డీఎస్పీలు అశ్వినీ గుప్తా, ఏకే బస్సీ కూడా ఉన్నారు. వీరిలో బస్సీని అండమాన్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. సిన్హాను నాగ్‌పూర్‌కు, గుప్తాను తన మాతృశాఖ అయిన ఇంటెలిజెన్స్ బ్యూరోకు పంపారు. ఈ ముగ్గురూ రాకేశ్ ఆస్థానాపై విచారణ జరుపుతున్న తరుణంలో బదిలీలకు గురయ్యారు. ఈ ముగ్గురూ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించి.. ఇంటర్వెన్షన్ దరఖాస్తులు దాఖలు చేశారు. అప్పటికే అలోక్‌వర్మ తనను బలవంతపు సెలవు మీద పంపడాన్ని సవాలు చేశారు. దాంతో వాళ్లు కూడా తమను ఈకేసులో పార్టీలుగా చూడాలని కోరారు. తన బదిలీ ఉత్తర్వులపై సుప్రీంకోర్టుకు వెళ్లని అదనపు ఎస్పీ ఎస్ఎస్ గుర్మ్ కూడా జబల్‌పూర్ నుంచి తిరిగి ఢిల్లీకి వచ్చారు. ఆయన కూడా ఆస్థానా కేసును దర్యాప్తుచేసిన బృందంలో ఉన్నారు. బాధ్యతలు స్వీకరించిన వర్మను సీబీఐ ప్రధాన కార్యాలయ భవనం ప్రవేశద్వారం వద్ద తాత్కాలిక డైరెక్టర్ నాగేశ్వరరావు స్వాగతించారు. ఆయన వెంటనే లోపలకు వెళ్లి.. వివిధ కీలకాధికారులతో సమావేశాలు నిర్వహించారు. రోజంతా సీనియర్ అధికారులు పలువురు ఆయన చాంబర్‌లోపలకు, బయటకు వెళ్లి వస్తూనే కనిపించారు. అయితే 77 రోజుల పాటు బలవంతపు సెలవులో ఉండటంతో అలోక్‌వర్మ ఈ కాలం మొత్తాన్ని తన సర్వీసు నుంచి కోల్పోయినట్లవుతుంది. దాని విషయం ఏం చేయబోతున్నారన్నది కూడా ఇంకా స్పష్టం కాలేదు.

ఐదుగురు అధికారుల బదిలీ

జాయింట్ డైరెక్టర్ అజయ్ భట్నాగర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) ఎంకే సిన్హా, డీఐజీ తరుణ్ గౌబా, జాయింట్ డైరెక్టర్ మురుగేశన్, అదనపు డైరెక్టర్ ఏకే శర్మలను బదిలీ చేశారు. అయితే వీళ్లను ఎక్కడకు పంపినదీ మాత్రం ఇంకా తెలియలేదు. ఇప్పుడు అలోక్‌వర్మపై మళ్లీ వేటు పడటంతో.. ఈ బదిలీలు కూడా ఉంటాయో, రద్దవుతాయో చూడాల్సి ఉంది.



కాలినడకన స్వామి చెంతకు...

(మొదటి పేజీ తరువాయి)

ఆరు గంటల సమయంలో ఆయన శ్రీవారి ఆలయం క్యూలైన్‌లోకి వెళ్లారు. స్వామివారి దర్శనం చేసుకుని వెలుపలకు రాగానే ఆయనను అభిమానులు చుట్టుముట్టారు. దీంతో కొద్దిపాటి తొక్కిసలాట జరిగింది. తరువాత ఆయన స్వరూపానంద సరస్వతి దర్శనార్థం వెళ్లారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగించుకుని గురువారం ఉదయం రైలుమార్గంలో రేణిగుంట చేరుకున్నారు. అక్కడినుంచి అభిమానుల సందోహం మధ్య ఆయన తిరుపతిలోని పద్మావతి అతిథి గృహం చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న ఆయన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తిరుమలకు కాలినడకన బయలుదేరారు. అలిపిరి పాదాల మండపం వద్ద తొలి మెట్టుకు సమస్కరించుకుని, నడక ప్రారంభించారు. ఆయనవెంట పలువురు అభిమానులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో బయలుదేరారు. పార్టీ నాయకులు ఎమ్మెల్యేలు రోజా, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అధికార ప్రతినిధి భూమన కరుణాకర్ రెడ్డి వెంట రాగా మెట్లు ఎక్కారు. దారి పొడవునా భక్తులకు అభివాదం చేస్తూ మార్గ మధ్యలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద కొబ్బరికాయ కొట్టారు. మెట్ల దారిలో భక్తులను పలకరిస్తూ మార్గ మధ్యలో నరసింహస్వామి ఆలయం వద్ద కూడా పూజలు నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు తిరుమలలోని శ్రీకృష్ణ అతిథిగృహానికి చేరుకుని విశ్రాంతి తీసుకున్నారు. తరువాత ఆయన శ్రీవారి ఆలయానికి బయలుదేరి, సాధారణ భక్తుడిలా స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడనుంచి శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని దర్శించుకుని, ఆయన ఆశీస్సులు పొందారు. రాత్రి తిరుమలలోనే బస చేస్తారని, శుక్రవారం ఉదయం బయలుదేరి ఇడుపులపాయకు చేరుకుంటారని వైసీపీ నాయకులు తెలిపారు.

ఇదో అద్భుతం



(మొదటి పేజీ తరువాయి)

సింగపూర్ ఎలా అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసునన్నారు. రాజధాని అభివృద్ధిలో సింగపూర్ ప్రభుత్వం సహకారం మరువలేమన్నారు. రాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. రూ.48 వేల కోట్లతో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సింగపూర్ తరహాలో అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చానని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకుంటున్నానన్నారు. నైపుణ్యాభివృద్ధిలో, పాలనలో సింగపూర్ సహకారానికి ధన్యవాదాలన్నారు. లీక్వాన్ యూనివర్సిటీ రేటింగులో ఆంధ్రప్రదేశ్ అగ్రగ్రామిగా వచ్చిందన్నారు. ప్రపంచంలోనే అద్భుతమైన రాజధాని నిర్మించుకుంటున్నామని, మన రాజధాని ప్రపంచంలో ఐదు అత్యున్నత నగరాలలో ఒకటిగా కావాలన్నారు. బుధవారం అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకున్నామని, ప్రపంచంలోనే అద్భుతమైన డేటా సెంటర్ హబ్ విశాఖలో పెడుతున్నామని చెప్పారు. డేటా సెంటర్ పార్కులతో పాటు సోలార్ పార్కులు వస్తున్నాయన్నారు. రూ. 70 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. లక్షా 10 వేల మంది ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అవినీతి రహిత రాష్ట్రంగా ఏపీని చేస్తున్నామని, ఇప్పటికే అవినీతి రహిత రాష్ట్రాలలో 3వ స్థానంలో ఉన్నామని చెప్పారు. సాంకేతికత ద్వారా పారదర్శక పాలన అందిస్తున్నామన్నారు. ప్రపంచంలోనే మేలైన సాంకేతికత అనుసరిస్తున్నామన్నారు. ఏపీ ఇప్పటికే దేశంలో అనేక రాష్ట్రాలకు నమూనాగా మారిందన్నారు. అతి త్వరలోనే ప్రపంచానికే నమూనా కానుందన్నారు. తొలి జన్మభూమిలో ఒక కోటి 50 లక్షల మేర ప్రజా ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన పరిపాలనను అందించామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల ఫిర్యాదుల సంఖ్య 4 లక్షలకు తగ్గడమే ఇందుకు నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. కృష్ణానది ఒడ్డున రాష్ట్రానికి నడిబొడ్డున రాజధాని తెచ్చామని, నదులను అనుసంధానం చేశామని అన్నారు. నీటి భద్రత ఇచ్చామని, పంచనదుల మహా సంగమం చేస్తున్నామని తెలిపారు. వెల్కమ్ గ్యాలరీ వాణిజ్య అభివృద్ధి కేంద్రంగా, సమాజ అభివృద్ధి కేంద్రంగా ఉంటుందన్నారు. 5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటయ్యే ఈ వెల్‌కమ్ గ్యాలరీ రాజధాని నగరం అమరావతిలో అభివృద్ధిని ఉత్తేజితం చేసేలా ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. సమాజం (కమ్యూనిటీ), వాణిజ్యం (బిజినెస్), భాగస్వామ్యాల (పార్టనర్‌షిప్)కు మూలకేంద్రంగా ఉంటుందన్నారు. ప్రాచీన తెలుగు సంస్కృతి విశిష్టతను, 2300 ఏళ్ల క్రితం తెలుగుజాతి వైభవాన్ని, స్మృతులను, గుర్తింపును ఈ వెల్‌కమ్ గ్యాలరీ ప్రతిబింబిస్తుందన్నారు. అమరావతి నగర గత వైభవాల వారసత్వ సంపదను స్ఫురణకు తేవడమే కాకుండా భవిష్యత్ తరాలకు స్ఫూరినిచ్చేలా గ్యాలరీ డిజైన్ ఉంటుందన్నారు. ప్రాచీన పురావస్తు స్మృతిచిహ్నాలతో పాటు ప్రస్తుత అధునాతన సాంఘిక అంశాలను ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతారన్నారు. ఎటుచూసినా పూర్తి పచ్చదనం పరిసరాల మధ్య 4,080 చ.మీ. బిల్డప్ ఏరియాలో వెల్కమ్ గ్యాలరీని నిర్మిస్తారన్నారు. ఏడీపీ సంస్థ ఇప్పటికే పార్టనర్‌షిప్ ప్రోగ్రామ్ చేపట్టిందన్నారు. స్మార్ట్ భవనాలు, స్మార్ట్ పర్యావరణం, స్మార్ట్ ఇంధనం, స్మార్ట్ సహకారం.. నాలుగు కీలక ప్రాంతాలలో అందరినీ భాగస్వాములను చేసిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే దీనికి అద్భుతమైన స్పందన లభించిందన్నారు. జర్మనీ, జపాన్, సింగపూర్, భారతదేశం నుంచి 15 కంపెనీలు అవగాహన ఒప్పందాలను (ఎంవోయూలను) అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ (ఏడిపి)తో చేసుకున్నాయన్నారు.

పటిష్ఠ బంధం

సింగపూర్, ఆంధ్రప్రదేశ్ మధ్య పటిష్ఠ బంధం ఏర్పడిందని సింగపూర్ మంత్రి ఈశ్వరన్ అన్నారు. అందువల్లే వివిధ రంగాలలో అద్భుతమైన సహకారం సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రి ముందుచూపు, సృజనాత్మక ఆలోచనల వల్లే ఇది సాధ్యం అయ్యిందన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధిలో ఇది తొలి అడుగు మాత్రమేనని, ఇదే విధమైన సహకారం ఇకముందు కూడా ఉంటుందన్నారు. ఇదే స్ఫూర్తితో ఏపీ రాజధాని అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామన్నారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన రైతుల ఆకాంక్షలను నెరవేర్చేలా రాజధాని నిర్మిస్తామన్నారు. సింగపూర్ ప్రభుత్వం తరపున పూర్తి తోడ్పాటు అందిస్తామన్నారు. ఏడిపి వెల్కమ్ గ్యాలరీ ఆంధ్రప్రదేశ్ ఔన్నత్యాన్ని, ఇక్కడి ప్రజల సంస్కృతిని గుర్తుచేసేలా కేపిటల్ సిటీ మోడల్‌ను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఎగ్జిబిషన్ కళలు, వినూత్న సాంకేతికత, పట్టణ పరిష్కారాల కేంద్రంగా ఉంటుందన్నారు. ఇందులో కన్వెన్షన్ సెంటర్లు, ఆహ్లాద కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు కూడా ఉంటాయి. రాజధాని ప్రాంతంలో స్టార్టప్‌ల కోసం ఒకేచోట వేర్వేరు సంస్థల వాళ్లు పనిచేసేలా అవకాశం కల్పిస్తారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాలకు, ప్రదర్శనలకు ఆతిథ్యం ఇచ్చేందుకు అనువుగా ఉంటుందన్నారు. సందర్శకులకు ఒకేచోట సమస్త సమాచారం లభ్యమవుతుంది. 2019 అక్టోబర్ చివరికల్లా ఈ వెల్కమ్ గ్యాలరీ పనిచేయడం ప్రారంభిస్తుంది. గ్యాలరీని రోజుకు 2వేల నుంచి 3వేల మంది సందర్శించుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో పలు అంతర్జాతీయ ఒప్పందాలకు ఈ వెల్కమ్ గ్యాలరీ గమ్యస్థానం కాబోతుంది. ఈ లక్ష్యంలో భాగంగా అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్‌గా గ్యాలరీ ప్రత్యేకత సంతరించుకోనుంది. కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, నక్కా ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్, ఏపీసీఆర్డీయే కమిషనర్ చెరుకూరి శ్రీధర్, అమరావతి డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ లక్ష్మీ పార్థసారథి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సాయిప్రసాద్, రాజమౌళి, గిరిజాశంకర్, రేరా అధ్యక్షులు రమానాథ్, సీఆర్డీయే అధికారులు, అమరావతి డెవలెప్‌మెంట్ అథారిటీ అధికారులు, సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులు, డెలిగేట్లు, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు పాల్గొన్నారు.

ఎన్జీవో సంఘం నేతగా నాయుడు

- బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తం
- అశోక్‌బాబు స్థానంలో బాధ్యతలు
- శ్రీకాకుళం జిల్లాలో హర్షాతిరేకాలు



శ్రీకాకుళం, జనవరి 10 (మనం న్యూస్ బ్యూరో): సిక్కోలు సిగలో మరో కీర్తిపతాక రెపరెపలాడింది. వెనుకబాటుతనం అనే మాటపై విజయం వైపు కదులుతూ నాయకత్వం వైపు పయనిస్తోంది. ఎన్జీవో సంఘ రాష్ట్ర శాఖ అధ్యక్షునిగా శ్రీకాకుళానికి చెందిన ఆ సంఘ సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు గురువారం నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఈ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న పరుచూరి అశోక్‌బాబు గురువారం స్వచ్ఛంద పదవీ విరమణ చేయడంతో ఆయన సంఘ సభ్యత్వం రద్దయింది. దీంతో జిల్లాకు చెందిన పురుషోత్తమ నాయుడును రాష్ట్ర ఎన్జీవో సంఘ అధ్యక్షునిగాఎన్నుకున్నట్లయింది. ఉద్యోగుల సమస్యలు, సీపీఎస్ రద్దు కోసం పురుషోత్తంనాయుడు చేస్తున్న పోరాటం కూడా ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చింది. అంతేకాకుండా సమైఖ్యాంధ్ర ఉద్యమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా వ్యవహరించిన పురుషోత్తంనాయుడు తీరును ఎందరో ప్రశంసించారు. సమాజసేవలోనూ, కష్టంలో ఉన్నవారిని ఆదుకోవడంలో కూడా పురుషోత్తంనాయుడు ముందుంటారన్న పేరుంది. సౌమ్యుడు, మృదుస్వభావిగా పేరున్న పురుషోత్తంనాయుడు ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికవడం పట్ల జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు సాయిరాం , చల్లా శ్రీనివాసరావుతో పాటతు ఆయన సన్నిహితులు సంబరాలు చేసుకుంటున్నారు.

సీమలోనూ 'తెలంగాణ' వాదం

ఈ సమస్యను గుర్తించే రాజకీయాల్లోకి.. దీనిపై ఆలోచించకుంటే భవిష్యత్తులో సమస్యలే

- ప్రజలకు సేవ కోసమే పాలిటిక్స్‌లోకి వచ్చా
- కడప జిల్లా నేతలతో పవన్ కల్యాణ్



అమరావతి, జనవరి 10: ఆంధ్రప్రదేశ్ విభజన కోసం ఒక పక్క విపరీతమైన పోరాటం జరుగుతుంటే, ఆ పోరాటం తాలూకు ఒత్తిడిని తట్టుకునే నాయకుడు ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కరు కూడా లేకుండా పోయారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇందిరాగాంధీ లాంటి రాజకీయ సంకల్పం బలంగా ఉన్న నేతలు ఎలాంటి ఒత్తిడిని అయినా అవలీలగా తట్టుకున్నారన్నారు. ఆవిడపై ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తన సిద్ధాంతానికి అనుగుణంగా రాష్ట్రాన్ని విభజించేందుకు అంగీకరించలేదని. అటువంటి నేతలు మనకు ఇప్పుడు కనుమరుగైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విజయవాడ జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకార్యాలయంలో కడప జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశంలో పవన్ మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 90వ దశకం చివరిలోనే తెలంగాణ భావజాలం బలపడడాన్ని తాను గమనించానని, ముఖ్యంగా యువతలో ఈ కోరిక బలపడడాన్ని గ్రహించానని పవన్ పేర్కొన్నారు. ఇది మార్పుకి సంకేతంగా నేను భావించానన్నారు. తెలంగాణ-ఆంధ్ర ప్రాంతాలు సాంస్క ృతికంగా సమ్మిళితం కాలేకపోయాయని, ఇది కూడా వేర్పాటు బీజాల అంకురార్పణకి కారణమని చెప్పారు. రాయలసీమలో కూడా ఇటువంటి పరిస్థితే ఉందని, దీనిపై మనం ఆలోచన చేయకపోతే భవిష్యత్తులో పరిస్థితులు ప్రమాదకరంగా మారుతాయని హెచ్చరించారు. ఈ మార్పు కోసమే నేను 2014లో జనసేన పార్టీని ప్రారంభించాను. దీనికి తోడు తృతీయ పక్షం లేకుంటే రాష్ట్రంలో ఉన్న రెండు రాజకీయ పక్షాలు తమ స్వార్థం కోసం రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసే ప్రమాదం ఉన్నందున మధ్యే మార్గంగా జనసేన ఆవిర్భావం జరిగిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రజారాజ్యం పెట్టక ముందు నేను కామన్‌మెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశానని, ఆ సమయంలో నాతోపాటు ఎవరైతే ఉన్నారో వారే జనసేన ఆవిర్భావ సమయంలో నాతోపాటు ఉన్నారని చెప్పారు. 2003లోనే రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నానని, అప్పటినుంచే ప్రపంచ, దేశ, రాష్ట్ర సమకాలీన రాజకీయ పరిస్థితుల్ని అధ్యయనం చేస్తూ వచ్చానని చెప్పారు. తన రాజకీయ ఆలోచనలకి అనుగుణంగానే తన సినిమాలకి కూడా రూపకల్పన చేశానన్నారు. దృఢమైన భావజాలంతోనే జనసేనకు రూపకల్పన చేశానని స్పష్టం చేశారు. తాను వ్యవస్థని బలపర్చడానికి వచ్చానే తప్ప వ్యక్తిగా బలపడడానికి రాలేదన్నారు. పోరాటం చేసే వారికే గెలుపు సిద్ధిస్తుంది. గెలుపు కోసమే పని చేసే వారితో గెలుపు దోబూచులాడుతుందని పేర్కొన్నారు. నాకు ముఖ్యమంత్రిగా పని చేయాలని ఉందంటూ ఓ పక్కన జగన్ అంటుంటే, మళ్లీ ముఖ్యమంత్రిని చేయమని నారా చంద్రబాబు అంటున్నారని ఎద్దేవా చేశారు. ఇలా అధికారం కోసం ఆలోచించే వారికి ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉండదని, ఇది మనకి చరిత్ర చెబుతున్న పాఠమని పేర్కొన్నారు. తనకు రాజకీయాలు అంటే వ్యాపారం కాదని, రాజకీయాల్లో తాను డబ్బు సంపాదించుకో నక్కర్లేదని పేర్కొన్నారు. స్టార్ డమ్ ఉన్నత స్థితిలో ఉన్న సమయంలోనే నేను క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చేశానన్నారు. 2003 నుంచి డబ్బు ప్రభావిత రాజకీ యాలు మన తెలుగు రాష్ట్రాల్లో పెరిగిపోయాయని, ఆ సమయంలోనే ఇటువంటి వ్యవస్థని మార్చడానికి ఒక నాయకుడు అవసరం అని భావిస్తున్న తరుణంలో చిరం జీవి ప్రజారాజ్యాన్ని స్థాపించారని చెప్పారు. అయితే లక్ష్య ఛేదనలో ఆయన పక్కన ఉన్నవారే ఆయన్ని నిరాశకు గురిచేశారని పేర్కొన్నారు. అటువంటి స్థితి తర్వాత నేను జనసేనను స్థాపించి కోట్లాది మంది జనం అభిమానం పొందుతున్నానంటే నేనెంత మొండివాణ్ణో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు.



రా రమ్మంటున్న 'ఆతిథ్యం'!

- పెట్టుబడులకు అపార అవకాశాలు
- మార్కెటింగ్ వ్యూహాలపై పర్యాటక శాఖ దృష్టి
- ప్రభుత్వ, ప్రవేటు భాగస్వామ్యమే కీలకం..శుక్లా

విజయవాడ, జనవరి 10: ఆతిథ్యరంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌లో విస్త ృత అవకాశాలున్నాయని రాష్ట్ర పర్యాటక ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ విజయవాడ వేదికగా గురువారం అతిథ్యరంగంలో ఉన్న అవకాశాలపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా శుక్లా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వనరులు మరే రాష్ట్రంలోనూ లేవని, వాటిని సద్వినియోగం చేసుకోవటం ద్వారా పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించవచ్చన్నారు. భవిష్యత్తంతా ప్రైవేటు పెట్టుబడిదారులదేనని, ఆ క్రమంలోనే పర్యటక శాఖ కేవలం మార్కెటింగ్‌పై దృష్టి పెడుతుందన్నారు. పర్యాటక శాఖ పరంగా ఔత్సాహిక పెట్టుబడిదారులకు తమ వంతు సహకారం అందించి..అవసరమైన భూమిని నిబంధనల మేరకు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. పర్యాటకశాఖ పరంగా ఆంధ్రప్రదేశ్‌లో అతిథ్యరంగం అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి పరిశ్రమ వర్గాలు అవగాహన కలిగించుకోవాలన్నారు. పర్యాటకుల పాదముద్రల పరంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని అందిపుచ్చుకోగా, కీలక సమయాలలో అతిథిగృహాల కొరత నెలకొంటుండగా దీన్ని అధికమించేందుకే సదస్సు ఏర్పాటు చేసినట్టు శుక్లా పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన నిపుణులు కార్యక్రమానికి తరలివచ్చారు. దాదాపు 50 మంది ప్రతినిధులు తమ ఆలోచనలను అధికారులతో పంచుకుని, సందేహాలకు నివృత్తి పొందారు. కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ జీఎంలు హరనాథ్, శ్రీదేవి, సీఎంవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల జూట్‌మిల్లు లాకౌట్

- అర్ధరాత్రి లాకౌటు నోటీసు
- పరారీలో యాజమాన్యం
- రోడ్డునపడ్డ కార్మికులు



విజయనగరం ప్రతినిధి/ నెల్లిమర్ల (మనం న్యూస్): నెల్లిమర్ల జూటుమిల్లుకు మళ్ళీ యాజమాన్య లాకౌటు ప్రకటించింది. చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్న కార్మిక కుటుంబాలకు పండగ విషాధాన్ని నింపబోతుందన్న ఆందోళనలో కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారు. కార్మికులను వంచించడానికి దఫదఫాలుగా లాకౌటు బూచీని చూపిస్తున్న యాజమాన్యం. రెండు రోజులు సార్వత్రిక సమ్మె తరువాత గురువారం ఉదయం ఆరు గంటలకు విడుదలకు వెళ్లిన కార్మికులు ఒక్కసారి మూతపడి వున్న మిల్లు గేటునూ ,లాకౌటు నోటీసునూచూసి హతాహాశులయ్యారు. యాజమాన్యం నోటీసుబోర్డులో కార్మికులు మిల్లులో సీసీ కెమెరాలను పెట్టనివ్వలేదని,యూనియన్‌లు మీటింగ్‌లకు వెళ్లడం వలన, ప్రతి చిన్న విషయాలకే కార్మికులను చూపించింది. దీన్ని చూసి చేసేది లేక కార్మికులు వెనుదిరిగారు. 25 ఏళ్ళ క్రితం లాకౌటు వ్యతిరేక ఉద్యమంలోనే పోలీసు కాల్పుల్లో ఐదుగురు కార్మికులు అమరులయ్యారు. భారతదేశ చరిత్రలోనే అప్పటి నెల్లిమర్ల కార్మికుల వీరోచిత పోరాటం ముందుబాగాన నిలిచింది. అటువంటి పరిస్థితులు మళ్ళీ పునరావృతం కాకూడదని కార్మికులు కోరుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు పతివాడ రమణ, కడగల ఆనంద్ ,సిఐటీయు నాయకులు టివి.రమణ, ఈఫ్టూ నాయకులు పి.ప్రసాద్ ఖండించారు. ఈలాకౌటు అక్రమమని వెంటనే బేషరతుగా మిల్లును తెరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

లాకౌటును భేషరతుగా ఎత్తివేయాలి..

నెల్లిమర్ల జూటు మిల్లు లాకౌటు అక్రమమైనదని బేషరతుగా ఎత్తివేయాలని ఇఫ్టూ జాతీయ కార్యదర్శి పి. ప్రసాద్ డిమాండ్ చేసారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ నెల్లిమర్ల జూటు మిల్లు యాజమాన్యం కార్మికులు ఎవరూ మిల్లులో లేని సందర్భంగా విధించిన లాకౌటు అక్రమమైనదని అన్నారు. 1989 నుండిమిల్లు యాజమాన్యం 8 సార్లు మిల్లుకు అక్రమంగా లాకౌటు విధించిందన్నారు. ఈ లాకౌటు కూడా గతంలో విదించిన లాకౌటులో బాగమేనన్నారు. ఈ ముప్పై ఏళ్ళలో సంక్రాంతి ముందు లాకౌటు వేయడం ఇదే ప్రదమమని అన్నారు. ఈ లాకౌటు ద్వారా కార్మికులను ,ప్రభుత్వాన్ని వంచించే దురుద్దేశం యాజమాన్యానికి వుందనిపిస్తుందన్నారు. ఎన్నికల ముందు లాకౌటు వేయడం ద్వారా ప్రభుత్వం నుండి రాయితీలు పొందేందుకు, అలాగే కార్మికులను ఒత్తిడికి గురిచేసి పనిబారాన్ని పెంచేందుకు కుట్ర పన్నిందన్నారు. లాకౌటుకి యాజమాన్యం చూపించే కారణాలు అన్నీ భౌతికంగా వాస్తవికంగా చెల్లుబాటు కానివని అవాస్తవమైనవని చెప్పారు. అదే నిజమైతే లేబరు అదికారుల ముందు యాజమాన్యం ఎందుకు చర్చలు జరపలేదన్నారు. మిల్లులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే హక్కు యాజమాన్యానికి లేదన్నారు. దీని కార్మికులను పని దొంగలుగా చిత్రీకరించే దురుద్దేశం యాజమాన్యానికి వుందని తెలిపారు. చట్టపరంగా ఎన్ని యూనియన్‌లు అయినా పెట్టుకోనే హక్కు కార్మికులకుందన్నారు. కార్మిక సంఘాలను ఉక్కుపాదంతో తొక్కడానికి యత్నిస్తుందన్నారు. ఇప్పటికే కార్మికులపై యాజమాన్యం పనిబారం పెంచిందన్నారు. కార్మిక చట్టాలకు విరుద్దంగా పాడి కూలీ కార్మికులతో పని చేయించుకుంటుందన్నారు. లేబర్ అధికారులముందు చర్చలు ఏర్పాటు చేస్తే యాజమాన్యమే దోషీగా నిరూపించబడుతుందని అకస్మాత్తుగా లాకౌటు ప్రకటించిందని చెప్పారు. దీనిపై రేపు (శనివారం) సాయింత్రం నాలుగు గంటలకు నెల్లిమర్ల అమరవీరుల భవనంలో కార్మికులతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ప్రసాదుతో బాటు తిమనాని అప్పారావు,నడిపేన అప్పారావు, గంటా పాపారావు, పతివాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



ఆహార పండగ!

- విజయవాడ, తిరుపతి, కాకినాడలో నిర్వహణ
- నేడు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రారంభం
- వారంపాటు అందుబాటులోకి నోరూరించే రుచులు

అమరావతి, జనవరి 10: తెలుగు దనం ప్రతిబింబించే వంటకాలను మరింతగా జనబాహుళ్యంలోకి తీసుకువెళ్లేలా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ నిరంతరం వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో నగరంలో నూతనంగా ప్రారంభించిన నోవాటెల్ హోటల్‌లో జనవరి 11 నుండి 24 వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుందని ఎపిటిఎ సిఇఓ, ఎపిటిడిసి ఎండి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ విడత ఏకకాలంలో మూడు చోట్ల ఆహార ఉత్సవాలు నిర్వహించనున్నారు. తిరుపతిలోని హోటల్ మానస్ సరోవర్, కాకినాడలోని మహేంద్రా మిఠాయి వాలాలలో ఈ ఆంధ్రా ఆహార పండుగలు నిర్వహిస్తున్నారు. విజయవాడలో జరిగే కార్యక్రమానికి స్వయంగా రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్క ృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా హాజరు కానుండగా ఆహార పండుగను పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఆచార్య జయరామి రెడ్డి ప్రారంభించనున్నారు. జనవరి 12వ తేదీన తిరుపతిలో ఆహార పండుగ ప్రారంభం కానుంది. తిరుపతి, కాకినాడలలో వారం రోజుల వరకే పండుగ పరిమితం కానుండగా, విజయవాడ నోవాటెల్‌లో 15 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.



వర్జీనియాకు దీటుగా విశాఖ

- ప్రకాశంలో 24 వేల కోట్లతో పేపర్ ఇండస్ట్రీ
- అభివృద్ధికి, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం
- జన్మభూమిపై టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 10: జన్మభూమి 9వరోజు పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో జిల్లాల కలెక్టర్లు,నోడల్ అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ..గతంలో కన్నా ఈ జన్మభూమిలో అత్యధికంగా ప్రజల భాగస్వామ్యం ఉందని ప్రశంసించారు. గ్రామసభలు విజయవంతం చేయాలని, శ్వేతపత్రంపై చర్చ జరిగేలా చూడాలని సూచించారు. వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఒక్కరోజే రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో ఒప్పందాలు చేశామన్నారు. లక్షా 26వేల ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. విశాఖలో డేటా సెంటర్ హబ్, డేటా సెంటర్ పార్కులు, సోలార్ పార్కులు. రూ.30వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ పార్కులు, రూ.40వేల కోట్లతో సోలార్ పార్కులు వస్తాయన్నారు. అమెరికాలోని వర్జీనియాకు ధీటుగా విశాఖ మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాలో రూ.24,500కోట్ల పెట్టుబడి రానుందని, ఆసియా పల్ప్ అండ్ పేపర్ మిల్స్ వస్తోందని చెప్పారు. ఈ పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా 4,500మందికి, పరోక్షంగా రూ.12వేల మందికి ఉపాధి కలుగుతుందని, 50వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ''రామాయపట్నం పోర్టు, భావనపాడు పోర్ట్ రానున్నాయి. లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ కానుంది.ఉత్తరాంధ్ర, రాయలసీమలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటవుతాయి. వెనుకబడిన జిల్లాలలో సంపదను సృష్టిస్తున్నాం. యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. వీటన్నింటినీ ప్రజలకు వివరించాలి.అటు అభివృద్ధికి, ఇటు సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చాం.జన్మభూమిలో విద్యార్థులు,ఉపాధ్యాయుల భాగస్వామ్యం అధికంగా ఉంది. పాఠశాలల ప్రహరీగోడల నిర్మాణంపై ప్రజల్లో సంతృప్తి.ఇళ్ల కోసం అనేక అర్జీలు వచ్చాయి. వచ్చిన అన్ని అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి. గ్రామ అభివృద్ధి ప్రణాళిక అత్యంత కీలకం. పకడ్బందీగా వాటిని రూపొందించాలి. అభివృద్ధి ప్రణాళికల్లో గ్రామసభల్లో సమగ్ర చర్చ. జన్మభూమిలో సంక్రాంతి సంబరాలు జరపాలి. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలిప్రభుత్వ పథకాలు ప్రతిబింబించేలా ముగ్గుల పోటీలు ఉండాలి'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

'సేవ'కు సత్కారం!

- ప్రాణదాతకు జాతీయ స్థాయి ఖ్యాతి
- జిల్లా రెడ్‌క్రాస్ సంస్థకు అవార్డుల పంట
- పదమూడు జిల్లాల్లో ప్రథమ స్థానం
- అంతా చైర్మన్ జగన్మోహన్‌రావు చొరవే
- గవర్నర్ చేతులమీదుగా పురస్కారాలు

శ్రీకాకుళం, జనవరి 10 (మనం న్యూస్ బ్యూరో): సిక్కోలు సిగలో మరో మల్లె వికసించింది. రెడ్‌క్రాస్ చరిత్రలో మరో కీర్తి బావుటా రెపరెపలాడింది. నిత్యమూ ప్రజా సేవలో మమేకమై..రక్తదాతలను చైతన్యవంతం చేస్తూ..రక్తాన్ని సేకరిస్తూ..ఆపదలో వున్న వారికి అందిస్తూ..వారి ప్రాణాలు నిలబెడుతున్న రెడ్‌క్రాస్‌కు సరైన సత్కారం లభించింది. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చొరవతో ఇంతింతై..వటుడింతై అన్నట్టు శ్రీకాకుళం రెడ్‌క్రాస్ సంస్థ ఎంతో మందికి రక్తదానం చేసి..ప్రాణాలు కాపాడింది. ఇక ఈ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సెర్వ్ ద్వారా మరింత సాయం అందిస్తున్నారు. విపత్తులనుంచి ఎలా బయటపడాలి..ఆ సమయాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు తదితర అంశాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు తర్ఫీదునిస్తూ..ముందుకు సాగుతున్న ఈ సంస్థకు అవార్డులు రావడంపై జిల్లా ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో 2017-18లో జిల్లాలో అందించిన సేవలకు సంబంధించి..రాష్ట్ర రెడ్‌క్రాస్ సంస్థ..జిల్లా రెడ్‌క్రాస్‌కు 25 పతకాలను ప్రకటించింది. వీటిలో ఏడు బంగారు, నాలుగు బంగారు పూతపోసిన పతకాలు, 14 రజత పతకాలు ఉన్నాయి. బుధవారం విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ చేతల మీదుగా జిల్లా అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు.

ముగ్గురికి ప్రాణరక్షక్ అవార్డులు

విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు రక్షించడంలో ముందంజలో వున్న ముగ్గురికి ప్రాణరక్షక్ అవార్డులు లభించాయి. ఎన్.ఉమాశంకర్(శ్రీకాకుళం), దోమ శాంత, రామచంద్రాపురం(గార), పందరి లక్ష్మి, అంబటివానిపేట(గార)అవార్డులకు ఎంపికయ్యారు.

అవార్డులు ఇలా..

కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జేసీ కేవీఎన్ చక్రధరబాబు, జేసీ-2 పి.రజనీకాంతారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సి.వి. నాగజ్యోతి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు సి.వి.ఎన్.మూర్తి, జిల్లా సహకార అధికారి బి.శ్రీహరిరావు, రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కె.దుర్గాశ్రీనివాస్‌లకు బంగారు పతకాలు వరించాయి. కలెక్టర్ తరపున జేసీ, జేసీ-2 తరపున రెడ్‌క్రాస్ చైర్మన్ అవార్డులు అందుకున్నారు.

ప్రజా సేవలో పునీతం..

ప్రజా సేవకు మరింత అంకితమవుతామని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు చెప్పారు. అవార్డులు అందుకున్న సంతోష సమయంలో ఆయన 'మనం' ప్రతినిధితో మాట్లాడారు.జిల్లా రెడ్‌క్రాస్‌లో చక్కనైన వలంటీర్లు ఉన్నారని, అందరూ సేవాభావంతో పనిచేస్తారని చెప్పారు. ఇక జిల్లా అధికారుల సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఏడు బంఆరు పతకాలు, నాలుగు బంగారు పూత పూసిన పతకాలు, తొమ్మిది రజత పతకాలతో పాటు ముగ్గురికి ప్రాణరక్షక్ అవార్డులు రావడంతో సంతోషంగా ఉందని, మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు. అంతా సమష్టి కృషి అని అభివర్ణించారు.



మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

శుక్రవారం, జనవరి 11

ఆశలపై నీళ్లు


అయోధ్య కేసులో ఎంత త్వరగా తీర్పు రావాలని పాలక హిందూత్వ శక్తులు, బీజేపీ, శివసేన వంటి రాజకీయ పార్టీలు కాంక్షిస్తున్నాయో అంత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. సుప్రీంకోర్టు గురువారం రామజన్మభూమి–బాబ్రీ మసీదు కేసును విచారణకు చేపట్టింది. ఐదుగురు సభ్యులతో కూడిన బెంచ్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ ఎన్వి రమణ, జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ యుయు లలిత్ ఉన్నారు. అనూహ్యంగా ఈ కేసు నుంచి జస్టిస్ యుయు లలిత్ తప్పుకోవడంతో విచారణను జనవరి 29కి వాయిదా వేశారు. దీంతో ఈ కేసు విచారణ మూడు అడుగులు ముందుకు, ఏడు అడుగులు వెనక్కి అన్నట్టుగా ఉన్నది. ఫలితంగా కేసు విచారణ మళ్లీ మొదటికి వచ్చిందని భావించవచ్చు.

ఈ బెంచ్‌లో సభ్యుడుగా ఉన్న జస్టిస్ లలిత్ 1997లో ఇదే కేసుకు సంబంధించి అప్పటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ తరపున న్యాయవాదిగా హాజరయ్యారు. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గగోయ్ నేతృత్వంలోని బెంచ్ చేపట్టగానే ముస్లిం కక్షిదారుడి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ ప్రస్తావనకు తీసుకొచ్చారు. విచారణ నుంచి జస్టిస్ లలిత్‌ను తప్పించాలని ధావన్ కోరకపోయినప్పటికీ విచారణ నుంచి తనకు తానుగా తప్పుకుంటున్నానని జస్టిస్ లలిత్ ప్రకటించారు. దీంతో ఈ కేసు విచారణ పూర్తయి తీర్పు కోసం ఆతృతతో ఎదురుచూస్తున్న హిందూత్వ శక్తులు, బీజేపీ పార్టీ ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.


ఇప్పటికే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అయోధ్యలో రామాలయం నిర్మాణం కోసం ఆర్డినెన్స్‌ను జారీ చేయాలని హిందూత్త శక్తులు పాలక బీజేపీపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. పాలకపార్టీ కూడా ఇందుకు సంసిద్ధంగా ఉన్నప్పటికీ రాజ్యసభలో మెజారిటీ లేకపోవడంతో ఆర్డినెన్స్ నీరుగారిపోతుందేమోనని భయంతో వెనకాడుతున్నట్టుగా కనిపిస్తోంది. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో నరేంద్ర మోదీకి అండగా నిలిచిన అనేక వర్గాలు దూరం కావడంతో బీజేపీలో తీవ్ర ఆందోళన మొదలైంది. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, యువతరం, నిరుద్యోగులు .... ఇలా ఒక్కరేమిటి అన్ని వర్గాలను దూరం కావడం బీజేపీకి కలవరం కలిగిస్తోంది. అంతేగాక రాజకీయంగా ఎన్‌డీఏ నుంచి కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా దూరమయ్యాయి. ప్రజల్లో వచ్చిన మార్పునకు సూచనగా గత నెలలో జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నిలుస్తాయనడంలో సందేహం లేదు. చేసిన తప్పులను సరిదిద్దుకునే సమయం కూడా లేకపోవడం బీజేపీని అయోమయంలో ముంచెత్తుతోంది.

అందుకే, బీజేపీ ఇప్పుడు ప్రజలను ఒకపక్క తాయిలాలతో ఊరిస్తూ, మరోపక్క మనోభావాలను రెచ్చగొట్టే పనిలో మునిగిపోతోంది. అందులో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు ఉద్యోగాలు, విద్యల్లో 10 శాతం రిజర్వేషన్ల బిల్లును తీసుకొచ్చింది. తరువాత సామాజికంగా, రాజకీయంగా నలుగుతున్న రామాలయం అంశాన్ని తెరపైకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. మరోవైపు కేరళలో అయ్యప్ప దేవాలయ ప్రవేశంపై ఉన్న వివక్షకు స్వస్తిచెప్పాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినప్పటికీ బీజేపీ, దాని అనుబంధ సంస్థలు ససేమిరా అంటున్నాయి. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో తమకు పనిలేదని, తాము అనుకున్నట్టుగా జరగాలని గతంలో ఎన్నడూ లేని కొత్త కొత్త సంప్రదాయాలకు తెరతీస్తోంది. అదే బీజేపీ ముస్లిం మహిళల తలాఖ్ విషయంలో సుప్రీంకోర్టు అభిప్రాయమంటూ తాననుకున్నట్టుగా తలాఖ్ బిల్లును తీసుకొచ్చింది.

ఇప్పుడు రామజన్మభూమి–బాబ్రీమసీదు అంశంలో సుప్రీం కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. కానీ, ఆ తీర్పు తమకు అనుకూలంగా వస్తేనే పాటిస్తారా లేక వ్యతిరేకంగా వస్తే అమలు చేస్తారా అనే అనుమానాలు, సందేహాలు జనసామాన్యంలో వస్తున్నాయి. సుప్రీంకోర్టు నిర్ణయంపై గౌరవం ఉంటే శబరిమలై ఆలయం ప్రవేశాలపై ఉన్నత న్యాయస్థానం తీర్పునకు భిన్నంగా బీజేపీ ఎందుకు స్పందిస్తోందో, కేరళను లోక్ష్యంగా ఎందుకు ఉద్యమాల పేరుతో రణరంగంగా మారుస్తోందో ఎవరికీ అంతుపట్టని విషయం. తాము అనుకున్నట్టుగా తీర్పులు రావాలనే కొత్త సంప్రదాయానికి బీజేపీ తెరపైకి తీసుకొచ్చింది. ఇకనుంచి తాము కోరిన విధంగా సుప్రీంకోర్టు తీర్పు చెప్పకపోతే దాన్ని లక్ష్యపెట్టేది లేదని చెప్పకనే చెబుతున్నట్టుగా ఆ పార్టీ వైఖరి కనిపిస్తోంది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలపై పెత్తనం చెలాయించాలనే చెడు సంప్రదాయాలకు అనుగుణంగా నడిస్తే ప్రజాస్వామ్యానికి, అనేక కోణాల్లో ఆలోచించి రాజ్యాంగాన్ని రూపొందించిన మేధావుల్ని అవమానించడం తప్ప మరొకటి కాదు. ఇప్పటికైనా చెడు సంప్రదాయాలకు శ్రీకారం చుట్టడం మానుకుని ప్రజాస్వామ్య బద్ధంగా, రాజ్యాంగ పరిధిలో నడుచుకుంటేనే ప్రజలు మద్దతు పలుకుతారు. లేకపోతే చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నా ప్రయోజనం ఉండదు. ●



మంచిమాట




అంకెలతో
దేనినైనా
నిరూపించవచ్చు
... ఒక్క నిజాన్ని
తప్ప.

– గౌతమ బుద్ధుడు

కత్తుల సమరానికి సంకెళ్లు పడేనా?

వరండాలో పంట ఉత్పత్తులు, వాకిట్లో అందమైన రంగవల్లులు.. వీధుల్లో హరిదాసుల సంకీర్తనలు–గంగిరెద్దుల విన్యాసాలు.. కూడళ్లలో భోగి మంటలు, ఇంటింటా పిండివంట సువాసనలూ, ఘుమఘుమలూ.. ఇళ్లంతా సందడిగా బంధువులు, కొత్త అల్లుళ్లు– కొంటె మరదళ్ల వేళాకోళాలు.. సంక్రాంతి అంటే సందడే సందడి..! ఇదీ నాకు తెలిసిన సంక్రాంతి.. కానీ నేడు సంక్రాంతి కాస్త జూద'క్రాంతి'లా తయారైంది. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో పందెంకోళ్లు ముందే కూస్తున్నాయి. పందేలకు అనుమతి ఇచ్చేది లేదని ముందుగానే అధికారులు ప్రకటించినా ఆ మూడురోజుల ముచ్చట నిరభ్యంతరంగా సాగుతుంది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆటవిడుపు కోసం అక్కడక్కడా నిర్వహించుకునే కోడిపందేలను నేడు సంస్కృతి, సంప్రదాయం ముసుగులో 'సంక్రాంతి అంటేనే కోడిపందేలు.. కోడి పందేలు అంటేనే సంక్రాంతి' అనే భావనను వ్యాపింపజేశారు మన పాలకులు. దేశవ్యాప్తంగా ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ పండుగుకు ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో ఒకవైపు ఐక్యమత్యాన్ని, సామరస్యాన్ని పెంపొందించేందుకు ప్రజాసంఘాలు వివిధ రకాల ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తుంటే.. మరోవైపు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోడిపందేలను వేడుకగా దగ్గరుండి మరీ నిర్వహిస్తున్నారు. కోడి పందేలు జరక్కుండా అడ్డుకోవాలని 2016 డిసెంబర్ 26న ఉమ్మడి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సంయుక్త తనిఖీ బృందాలు ఏర్పాటు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పిలను ఆదేశించింది. కోర్టు ఆదేశాలకనుగుణంగా వివిధ జిల్లాస్థాయి పోలీసులు కూడా 144 సెక్షన్ అమలు చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ పందేలను జరగనివ్వబోమని ప్రగల్భాలు పలికారు. అయితే అవన్నీ ఉత్తుత్తి మాటలుగానే మిగిలిపోయాయి. ఎవరెన్ని ఆంక్షలు పెట్టినా అప్పటి నుంచి ఇప్పటి వరకూ సంక్రాంతి కోడిదే పైచేయి అయ్యింది. బరిలో నిలిచిన కోడే కాల రెగరేసింది. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో నిర్వాహకులు వేలాది బరులు ఏర్పాటు చేసి కోడిపందేలు యథేచ్ఛగా నిర్వహించారు. సంక్రాంతి మూడు రోజులే కాదు ముందూ వెనక కలుపుకొని వారం రోజులూ కోడిపందేల్లో మద్యం ఏరులు దాటి నదులై పారింది. బెట్టింగుల రూపంలో వందల కోట్ల రూపాయలు చేతులు మారాయి. అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు హద్దులు దాటి అడ్డూ అదుపు లేకుండా పోయాయి. గుండాటలూ, మూడుముక్కలాటలూ, అన్ని వ్యసనాలూ కోడిపందేల ముసుగులో రంజుగా సాగాయి. ఒక్క కోడిపందేలేంటీ? అనంతపురం జిల్లాలో తాడిపత్రి ఎమ్మెల్యే జెసి దివాకర్‌రెడ్డి పందుల పందేలను నిర్వహించగా.. కృష్ణా జిల్లాలో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పొట్టేళ్ల పందేలను నిర్వహించారు. అయితే సంక్రాంతి సందర్భంగా కేవలం తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించేందుకే కోడిపందేలు నిర్వహిస్తున్నామని ఒకపక్క ప్రభుత్వం, మరోపక్క నాయకులు చెప్తున్నారు. ఈ వాదనలో ఆవగింజంత కూడా నిజం లేదు. కోడి పందేలు, వాటి మాటున జరిగే జూదాన్ని సంస్కృతి, సంప్రదాయం ముసుగులో ప్రోత్సహించడానికే తప్ప రాజసానికి ప్రతీక అనో, సంప్రదాయం అనో ఎంతమాత్రమూ కాదు. ఒకటి కాదు రెండు కాదు ప్రతి ఏడాదీ ఇదే వ్యవహారం నడుస్తోంది. సంక్రాంతి అంటే కోడి పందేలేనన్న ఒరవడిని పాదుకొల్పడంలో అధికారపార్టీ, ప్రతిపక్షపార్టీలు సిగ్గు విడిచి మరీ కృతకృత్యమయ్యాయి. సంక్రాంతి నాడు జూద క్రాంతిని



> మన దగ్గరే కాదు. ప్రపంచంలోని చాలా దేశాల్లోనూ కోడిపందేలు నిర్వహిస్తుంటారు. ఆగ్నేయ ఆసియా దేశాల్లో ప్రభుత్వాలు నిషేధించినప్పటికీ రాజకీయ నాయకులు, మాఫియా ముఠాలు ఈ పందేలను నిర్వహించడం విశేషం. ఫిలిప్పీన్స్‌లో పండగలతో సంబంధం లేకుండా మామూలు రోజుల్లో కూడా కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహిస్తూనే ఉంటారు. పందెం జరిగే ప్రాంతాన్ని మన రాష్ట్రంలో బరి అంటారు. ఫిలిప్పీన్స్‌లో అరెంటా కొలీజియం అంటారు. థాయ్‌లాండ్, వియత్నాం, పాకిస్థాన్‌లో సింధ్, ముల్తాన్, బెలుచిస్తాన్ ప్రాంతాల్లోనూ కోడిపందేలు భారీగా సాగుతాయి. స్పెయిన్‌లో కానరి ద్వీపాలలో కోడిపందేలు సాగుతాయి. అయితే దేశం లోని మిగిలిన ప్రాంతాల్లో నిషేధం ఉంది. మెక్సికో, పెరూలోనూ కోడిపందేలు ఆడతారు. పెరూలో కత్తులు లేకుండా పోటీలు జరుగుతాయి. బ్రెజిల్ దేశంలో కోడిపందేలు నిషేధం అయిప్పటికీ దేశం అన్ని ప్రాం తాల్లోనూ ఏటా పోటీలు జరుగుతూనే ఉంటాయి.

ప్రసరింపజేసి చట్టాలపైనే కాదు తమకు న్యాయస్థానాలపైనా గౌరవం లేదని నిరూపించారు. తమను పాలించే వారికే సిగ్గు లేనప్పుడు తమకెందుకు సిగ్గు అనుకున్నారో ఏమో ప్రతిపక్ష నాయకులు సైతం వారితో కలిసిపోయి జూదమాడారు. కోర్టు తీర్పును వక్రీకరించి నిర్వహించిన కోడిపందేలపై కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో జిల్లా కలెక్టర్లు, ఎస్పిలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను సైతం బాధ్యులను చేసింది.

సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం.. 2018లో అయినా కోళ్లకు కత్తులు కట్టకుండా ఢింకీ పందేలు మాత్రమే నిర్వహించాలని, కోర్టు ఆదేశాలను వక్రీకరించి నిర్వహించే కోడిపందేలను అడ్డుకుని తీరాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అయితే ఆ సంవత్సరమూ కోర్టు తీర్పును వక్రీకరిస్తూ కోడి పందేలను యథేచ్ఛగా నిర్వహించారు. పందేలను పోలీసు యంత్రాంగం అడ్డుకోలేకపోనప్పటికీ నిర్వాహకులపై కేసులు నమోదు చేసింది. 1960 జంతు చట్టం, 1974 గేమింగ్ చట్టం చట్టాలను అతిక్రమించి, కోర్టు ఆదేశాలను ధిక్కరించి కోడిపందేలు, ఇతర జూద క్రీడలను నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేసింది. పశ్చిమ గోదావరి జిల్లాలో 555 కేసులు నమోదు కాగా.. 1916 మందిని అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 436 కేసులు నమోదు చేసి, 1681 మందిని అరెస్టు చేశారు. కృష్ణా జిల్లాలో 382 కేసులు నమోదు కాగా.. 955 మందిని అరెస్టు చేశారు. విశాఖ జిల్లాలో 409 కేసులు నమోదు చేసి, 456 మందిని అరెస్టు చేశారు. గుంటూరు జిల్లాలో 289 కేసులు నమోదు కాగా.. 353 మందిని అరెస్టు చేశారు. విజయవాడలో 36 కేసులు నమోదు చేసి, 216 మందిని అరెస్టు చేశారు. రాజమండ్రి అర్బన్‌లో 69 కేసులు నమోదు కాగా.. 151 మందిని అరెస్టు చేసినట్లు పోలీసుల అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కోడిపందేలకు పెట్టింది పేరైన ఉభయ గోదావరి జిల్లాల్లో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. అంతే మొత్తంలో నిర్వాహకులు కూడా అరెస్టయ్యారు. అయితే చాలాప్రాంతాల్లో నిర్వాహకుల చేతుల్లో పోలీసులు కీలుబొమ్మలుగా మారారనే సమాచారమూ ఉంది. బరుల నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకొని చూసీచూడనట్లు మిన్నకుండిపోయారనే ఆరోపణలూ లేకపోలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే ఎన్నికల వేడి మొదలైంది. అధికార, ప్రతిపక్ష నాయకులు అక్కడక్కడా ఎన్నికల ప్రచారమూ మొదలెట్టేశారు. ఇక నోటిఫికేషన్ వెలువడమే ఆలస్యం.. నేతలందరూ ప్రచారంలో మునిగిపోతారు. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో రానున్న సంక్రాంతి ఎన్నికల ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ప్రతి ఏటా జనవరిలో సంక్రాంతి పండుగ రావడం, ఈ ఏడు సాధారణ ఎన్నికలు జరగనుండటంతో నాయకులకు ఈ సంక్రాంతి... ఎన్నికల సంక్రాంతిగా మారింది. ప్రజలను ఆకటుకునేందుకు, తమతమ నియోజకవర్గాల్లో అధికార, ప్రతిపక్ష నేతలు సొంతంగానే బరులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. తమ పలుకుబడిని చూపించి ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇదొక మంచి అవకాశంగానూ భావిస్తున్నారు.

మన దగ్గరే కాదు. ప్రపంచంలోని చాలా దేశాల్లోనూ కోడిపందేలు నిర్వహిస్తుంటారు. ఆగ్నేయ ఆసియా దేశాల్లో ప్రభుత్వాలు నిషేధించినప్పటికీ రాజకీయ నాయకులు, మాఫియా ముఠాలు ఈ పందేలను నిర్వహించడం విశేషం. ఫిలిప్పీన్స్‌లో పండగలతో సంబంధం లేకుండా మామూలు రోజుల్లో కూడా కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహిస్తూనే ఉంటారు. పందెం జరిగే ప్రాంతాన్ని మన రాష్ట్రంలో బరి అంటారు. ఫిలిప్పీన్స్‌లో అరెంటా కొలీజియం అంటారు. థాయ్‌లాండ్, వియత్నాం, పాకిస్థాన్‌లో సింధ్, ముల్తాన్, బెలుచిస్తాన్ ప్రాంతాల్లోనూ కోడి పందేలు భారీగా సాగుతాయి. స్పెయిన్‌లో కానరి ద్వీపాలలో కోడిపందేలు సాగుతాయి. అయితే దేశం లోని మిగిలిన ప్రాంతాల్లో నిషేధం ఉంది. మెక్సికో, పెరూలోనూ కోడిపందేలు ఆడతారు. పెరూలో కత్తులు లేకుండా పోటీలు జరుగుతాయి. బ్రెజిల్ దేశంలో కోడిపందేలు నిషేధం అయిప్పటికీ దేశం అన్ని ప్రాంతాల్లోనూ ఏటా పోటీలు జరుగుతూనే ఉంటాయి.

◆ అల్లూరి ప్రభుకుమార్
8790988119



నేటితరం యువత ఆత్మ విశ్వాసంతో కార్యోన్ముఖులైతే సింహం వలె సమస్యలను పరిష్కరించగలరు. తెలంగాణలో శాసనసభ ఎన్నికలు జరిగి నూతన ప్రభుత్వం కొలువు దీరింది. ఆ వెను వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. ఆ తర్వాత జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. తెలంగాణ ప్రజలకు 2019 ఎన్నికల నామ సంవత్సరం గానుంది. తొలి స్వతంత్ర పోరాటాల నుండి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ఆ తర్వాత తొలి, మలి తెలంగాణ సాధన పోరులో ప్రజలు కీలక భూమిక పోషించి అటు స్వాతంత్ర్య సాధనలో ఇటు తెలంగాణ సాధనలోనూ కృతకృత్యులై, విజయాన్ని సాధించి నారు. నేడు పంచాయితీ ఎన్నికల కోలాహలం కొనసాగు తున్న వేళ.. పంచాయితీ నుండి పార్లమెంట్ దాకా, యువతీ యువత రాజకీయాల్లో ప్రవేశించి నిస్వార్థంగా సేవాగుణం తో రాజకీయాలను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. భారత దేశంలో ప్రపంచంలోని దేశాల కన్నా ఎ క్కువ యువజనాభా గల దేశంగా గణాంకాలు తెలియ జేస్తున్నాయి. అధిక జనశక్తి తోడుగా యువజన శక్తిని సక్ర మంగా ఉపయోగించలేని కారణంగా మనం వెనుకబడి పోతున్నాము. నేటి యువత పంచాయితి నుండి పార్లమెంట్ దాకా రాజకీయాల్లోకి వచ్చి అవినీతి, బంధుప్రీతి కుంభకోణా లను రూపుమాపి రాష్ట్ర, దేశచరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలకాల్సి ఉందని మేధావులు, ప్రజలు భావిస్తు న్నారు. ఎవరు ఎక్కడికి పోతే నాకేందిలే నేను నా కుటుంబం బాగుంటే చాలుననే విధానాలకు చరమగీతం పాడాలి. నాడు దేశ స్వతంత్ర పోరులో ప్రాణాలను తృణప్రాయంగా, మొన్న తెలంగాణ సాధనలో అమరులైన వారి త్యాగాలను వృథా కానీయరాదు. వారి నుండి నేటి యువత స్ఫూర్తిని పొంది భావితరాల భవిష్యత్ బాగుపడేలా పాలనలో భాగస్వామ్యు లు కావాలి. నేటి యువత అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని, తన బాధ్యతను, కర్తవ్యాన్ని చిత్త శుద్ధితో నిర్వహించి గ్రామం నుండి దేశం వరకు అభివృద్ధి పథంలో నడిపేలా ప్రణాళికల రూపకల్పన నుండి ప్రగతి ఫలాలు క్షేత్రస్థాయిలోని ప్రజలకు అందేలా పాలనలో వైవి ధ్యాన్ని, నూతన వైఖరులను, వినూత్న పాలన అందిస్తూ మానవీయ కోణం వెల్లివిరియాల్సి ఉందని గమనించండి. 'అంగట్లో అన్ని ఉండి అల్లుని నోట్లో శని ఉందన్నట్లు' యువతను సరైన మార్గదర్శకం చేయలేని విధానాల వలన యూత్(మ్యాన్) పవర్ నిరుపయోగంగా మారి సమాజంలో అశాంతికి కారకులౌతారని గత అనుభవాలు తెలుపుతు న్నాయి.
యువతరం పొంగిపొర్లే నదిలాంటిది. ఊరకే వదిలితే ఉప్పు సముద్రం పాలేనని, పాలకులు గమనించాలి, యువత మేల్కొనాలి.

యువజనోత్సవాలు ప్రతి సంవత్సరం వస్తున్నాయి, పోతున్నాయి. కానీ పాలకులు ఆ రోజు కొన్ని యువతకు సంబంధించిన పథకాలు, కార్యక్రమాలు తూతూ మంత్రం గా చేస్తూ ప్రచారంలో ఆర్భాటాలే తప్ప, యువత జీవితంలో ఆశించిన స్థాయి ప్రగతి సాధించిన దాలాలు లేవు. 'నేతి బీరలో నెయ్యి' చందంగా మారిందనేది వాస్తవం కాదా! యువతలో నైపుణ్యం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగి నిరుద్యోగ భూతం తరమ బడాలన్నా, ఈ సమాజం తక్షణ



యువజనం-నవపథం..!

పురోగతి సాధించాలన్నా యువజనాభా ఎక్కువగా గల సమాజంలో యువత పాలనా పగ్గాలు చేపట్టాలి. సగటు భారతీయుడి బతుకు బాగుపడాలన్న స్వామి వివేకానందుడిలోని స్ఫూర్తిని వజ్రసంకల్పంగా పాలన చేబూనాలి, అభి వృద్ధి పథంలో నడిపించాలి. సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ లాంటి ఎందరో తొలి స్వతంత్ర సమరయోధుల నుండి తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, మొన్నటి శ్రీకాంతాచారి వరకు ఇంకెందరో యువకులు ఆత్మ లిదానాలు చేసుకున్న విషయం నేటి యువత వారి త్యాగా లను నేటి ప్రజలు, యువ సమాజం మరువరాదు. ఈ 2019 ఎన్నికల నామ సంవత్సరంలో పంచాయితీ నుండి పార్లమెంటు దాకా అన్ని రకాల పాలనా వ్యవస్థల్లో రాజకీయ ప్రవేశం, యువత భాగస్వామ్యం పెరగాలి. అలా పాలనా పగ్గాలు చేపట్టిన యువత పంచాయతి నుండి పార్లమెంట్ వరకు పాలనలో, ప్రణాళికల్లో యువత మార్కు (ప్రాతిపదిక, ప్రతిపత్తి) కనిపించాలి, అభివృద్ధి వైపు అడుగులు పడాలి. యువజనోత్సవానికి 2019 ఎన్నికల నామా సంవ త్సరానికి రాజకీయ ప్రవేశం చేయడం, కీలక బాధ్యతల్లో ఉండి సమర్థవంతమైన పాలన అందివ్వడమే మిరిచ్చే 2019 యువజనోత్సవానికి నిజమైన అర్థం అని గమనించండి. శ్రీశ్రీ చెప్పినట్లు కొంతమంది యువకులు పుట్టకతో వృద్ధులు అనే అపవాదుతో పాటు వ్యసనాల నుండి యువత బయటపడి తమ సత్తాను, సత్తువను చూపుతూ నేటి సమాజానికి చాటింపువేసి చాటి చెప్పాలి. వారసత్వపాలన, కుటుంబ పాలన లాంటి వాటికి స్వస్థి పలకాలి. 'ఇండ్లు కాలునపుడు బావి తవ్వించినట్లు'గా గత బూజు విధానాల బూజు దులుపాలి యువలోకం. నవలోకానికి నాంది పలకాలి. గత చరిత్ర చదవడంతో పాటు భావితరానికి చరిత్ర సృష్టించాలి. భారత ప్రజాస్వామ్య పార్టీ విధానంలో పార్టీలన్నీ యువతకు సముచిత స్థాయిలో రాజకీయ ప్రవేశానికి స్థానం కల్పించాలి. ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ వైఖరులను మేధస్సునిండా నింపుకున్న యువత సానుభూతి పొంగిపొర్లిస్తూ సమసమా నిర్మాణానికి సేవకులుగా మారం డి. ప్రపంచంలోనే ఏ దేశంలో లేని విధంగా 60 శాతం యువ జనాభా గల దేశంగా రాబోవు కాలంలో భారత్ అగ్రభాగాన నిలుస్తుందని మనవైపు ప్రపంచం చూస్తోంది. ఇలాంటి వేళ.. భారత్ యువత కరిగిపోయే యువ ప్రాయాన్ని సద్వినియోగ పరుచుకోవాలి. జాతి జనుల కోసం, భారతదేశం కోసం బంగారంలోని ప్రతి అణువు ఎంత విలువైందో.. గడిచే కాలంలోని ఒక్కొక్క ఘడియ అంతకన్నా విలువైందని తెలుసుకొని పాలకులు, ప్రజలు, యువత మసులుకోవాలి. గతమంతా 'చేతులు కాళ్క ఆకులు పట్టుకున్నట్లు'గా గడిచిందని గమనించండి. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం పదవులకు రిజర్వేషన్ కల్పించినట్లు బీరాలు పలికేవారు చట్టసభల్లో ఎందుకు స్థానం కల్పించలేకపోతున్నారని, మహిళా బిల్లుకు పార్లమెంట్ లో ఆమోదం ఎందుకు లభించడం లేదని మహిళా సమాజం భావిస్తుంది.

ప్రపంచ యువతకు మార్గనిర్దేశకుడిగా నిలిచిన స్వామి వివేకానందుని జయంతి (జనవరి 12)ని పురస్కరించుకొని దేశ భవితకోసం యువతరం సృజనశీల ఆలోచనలతో ముందుకు వెళ్ళేందుకు యువజనం నవపథంలో కుళ్లు రాజకీయాలు, అవినీతి రాజకీయాలు అంటూ శాపనార్థాలు మానాలి. పాలనా పగ్గాలు చేబూని దేశాన్ని నవపథం వైపు నడిపించాలి. దేశంలోని జాతి సంపద కొద్దిమంది (కుటుంబాల) చేతుల్లోకి వెళ్ళకుండా నిలువరించాలి. చీమలు నిర్మించుకున్న పుట్ట పాములపాలైనట్లు 50 శాతం జనా భాగల యువత పాలకులై ప్రజలకు జాతి సంపదను, ప్రగతి ఫలాలను సమంగా పంచే రోజు రావాలి.

నేటి ఆధునిక విద్యాలయాల్లో విద్యార్థులకు మానవతా విలువలు బోధించకపోవడం వలన, యువప్రాయంలోనే వారు వ్యసనాలకు బానిసలౌతున్నారు. జన్మనెత్తిన క్షణం నుంచి జన్మనిచ్చే స్థాయికి చేరి కేవలం తన జన్మేకాక ఇతరుల జన్మ సార్థకత చేకూర్చ వలసిన ప్రక్రియలో ఈ నాటి యువత నిర్లక్ష్యంతో పెడదోవపడుతోంది.

◆ మేకిరి దామోదర్
9573666650

(రేపు జాతీయ యువజన దినోత్సవం)

అమ్మ గర్భం

కవిత

దేవుడు సృష్టించే ఓ ముద్ద
ఊపిరి పోసేను పిండంగా...
అమ్మ పొట్టలో జారవిడిచే
అప్పుడే మొదలైయెను నీ జననం...
మొదటి కష్టమే ఎదురవుతూ
తీయని కబురు తెలిసొచ్చే...
మాతృమూర్తినైయ్యానని
మురిసిపోయేలే ఆ తల్లి...
ముడవనెలలో మార్పులకు
ఉప్పొంగేలే అమ్మ మది...
నాలుగునెలల గర్భంతో
కలకళలాడెను అమ్మ మొహం...
అత్తవారి ఇంట్లో శ్రీమంతం
ఐదవనెలలో సంతోషం...
పరవసించేలే అమ్మ హృది
అరవనెలలో ఆతురత
తన బిడ్డను ముద్దాడాలనీ...
ఏడవనెలల్లో నెమ్మదించే
అడుగులు నేర్వని పాపాయిలా...
గిలిగిలిగా అమ్మ మనసు
ఎనిమిదో నెల చేరుకోగా...
నిదుర రానిదు నా బిడ్డ
లేత పాదాల తన్నులతో...
పుట్టినింటి వారి శ్రీమంతం
సంబరమాయలే తొమ్మిదోనెల...
గడియ గడియకు గండంగా
ప్రసవ వేదనతో తల్లడిల్లే...
ప్రాణాన్ని బనంగా పెట్టి
నరకాన్ని ప్రత్యక్షంగా చూసే...
ఊపిరి ఆగెలా పునర్జన్మ చవిచూసే
పండంటి బిడ్డకు జన్మనిచ్చే...
కడుపు నుండి అమ్మ వడి చేరే
పడిన కష్టాన్ని కన్నీళ్లను మరిచి
అక్కున చేర్చి ఆనందించే ఆ తల్లి...

– శివేగారి చిన్నికృష్ణ
6300318230

సెన్సెక్స్ టాప్ గైనర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
టాటా మోటార్స్	+1.34	రూ. 185.55
టాటా మోటార్స్-డీవీఆర్	+1.13	రూ. 98.05
ఎన్‌టీపీసీ	+1.09	రూ. 147.75
ఎం అండ్ ఎం	+0.99	రూ. 733.30
బజాజ్ ఆటో	+0.86	రూ. 2,718.75
భారతీ ఎయిర్‌టెల్	+0.63	రూ. 337.25
ఇన్ఫోసిస్	+0.58	రూ. 679.75
లార్సెన్ టూబ్రో	+0.36	రూ. 1,390.25
వేదాంత	+0.21	రూ. 195.10
టాటా స్టీల్	+0.20	రూ. 480.30

సెన్సెక్స్ టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
ఇండస్‌ఇండ్	-2.15	రూ. 1,566.45
కోటక్ మహీంద్రా	-1.42	రూ. 1,221.31
ఓఎన్‌జీసీ	-1.37	రూ. 143.55
మారుతి సుజుకీ	-1.07	రూ. 7,385.95
యాక్సిస్ బ్యాంకు	-1.05	రూ. 663.00
సన్ ఫార్మా	-0.79	రూ. 443.85
హెచ్‌డీఎఫ్‌సీ	-0.72	రూ. 1,979.00
హీరో మోటోకార్ప్	-0.61	రూ. 2,922.65
ఐసీఐసీఐ బ్యాంకు	-0.60	రూ. 379.70
పవర్ గ్రిడ్ కార్పొరేషన్	-0.56	రూ. 196.10

నిఫ్టీ టాప్ గైనర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
టాటా మోటార్స్	+1.48	రూ. 185.75
టైటాన్ కంపెనీ	+1.44	రూ. 966.70
ఐషర్ మోటార్స్	+1.31	రూ. 20,556.10
యూపీఎల్	+1.09	రూ. 773.10
ఎన్‌టీపీసీ	+1.06	రూ. 148.10
బజాజ్ ఆటో	+1.05	రూ. 2,725.30
ఎం అండ్ ఎం	+1.05	రూ. 733.20
భారతీ ఎయిర్‌టెల్	+0.84	రూ. 337.30
అదానీ పోర్ట్స్	+0.78	రూ. 380.25

నిఫ్టీ టాప్ లూజర్స్

కంపెనీ	పాయింట్లు	ప్రస్తుత షేర్ ధర
హెచ్‌పీసీఎల్	-2.55	రూ. 232.90
ఇండస్‌ఇండ్	-2.24	రూ. 1,56590
భారతీ ఇన్‌ఫ్రా	-1.83	రూ. 285.05
గ్రాసిమ్	-1.81	రూ. 820.20
ఐఓసీఎల్	-1,59	రూ. 129.90
కోటక్ మహీంద్రా	-1.51	రూ. 1,219.55
ఓఎన్‌జీసీ	-1,41	రూ. 143.25
మారుతి సుజుకి	-1.35	రూ. 7,391.60
బీపీసీఎల్	-1.31	రూ. 335.60
యాక్సిస్ బ్యాంకు	-1.02	రూ. 663.25

లాభాల ట్రెండ్‌కు ముగింపు

సెన్సెక్స్ 100 పాయింట్లకు పైగా డౌన్

- **36,000 మార్క్‌కుపైనే నిలిచిన ఇండెక్స్**
- **10,800 స్థాయిని కాపాడుకున్న నిఫ్టీ**



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్ నాలుగు రోజుల లాభాలకు గురువారం బ్రేకులు పడ్డాయి. లాభాల్లో ప్రారంభమైన బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు తర్వాత ఆ లాభాలను నిలుపుకోలేకపోయాయి. చివరకు సెన్సెక్స్ 106 పాయింట్ల నష్టంతో36,106 వద్ద, నిఫ్టీ 34 పాయింట్ల నష్టంతో 10,821 వద్ద క్లోజయ్యాయి. నిఫ్టీ 50లో టైటాన్, టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, సిప్లా, ఎంఅండ్ఎం, యూపీఎల్, యస్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. అదేసమయంలో హెచ్‌పీసీఎల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, గ్రాసిమ్, భారతీ ఇన్‌ఫ్రాటెల్, మారుతీ సుజుకీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐఓసీ, బీపీసీఎల్ షేర్లు నష్టపోయాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 2 శాతానికి పైగా పడిపోయింది. టైటాన్, టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్, బజాజ్ ఆటో షేర్లు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు బలహీనంగా ఉండటం, ఐరోపా మార్కెట్ నుంచి



ప్రతికూల సంకేతాలు అందటం వంటి అంశాలు మన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. అలాగే డిసెంబర్ క్వార్టర్ ఫలితాల వెల్లడి సీజన్ ప్రారంభం కావడంతో ఇన్వెస్టర్లు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఇంట్రాడేలో నిఫ్టీ 10,801 పాయింట్ల కనిష్ట స్థాయిని, 10,859 పాయింట్ల గరిష్ట స్థాయిని తాకింది. ఇక సెన్సెక్స్ 36,070- 36,269 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. సెక్టోరల్ ఇండెక్స్‌లు మిశ్రమంగా ముగిశాయి. నిఫ్టీ ఆటో, నిఫ్టీ మీడియా, నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్‌లు మినహా మిగతావి నష్టాల్లోనే ముగిశాయి. ఫైనాన్షియల్ షేర్లు ఎక్కువగా పడిపోవడం ఇండెక్స్‌లపై ఒత్తిడిని పెంచాయి.

బెజోస్ షాకింగ్ ప్రకటన

- **25 ఏళ్ల దాంపత్య జీవితానికి ముగింపు**
- **విడిపోనున్నట్లు ట్వీట్ చేసిన దంపతులు**
- **అమెజాన్ సీఈవోది ఇక ఒంటరి జీవితం**



అమెజాన్ 1994లో ఏర్పాటైంది. ఇది తొలిగా ఆన్‌లైన్‌లో పుస్తకాలు మాత్రమే విక్రయించేది. కంపెనీ ఏర్పాటైన తొలినాళ్లలో మెకంజీ అందులో అకౌంటింగ్ బాధ్యతలు చూసుకునేవారు. ఆయన ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడు. అలాగే ప్రపంచంలోని అత్యంత విలువైజూ కంపెనీకి ఆయనే చీఫ్‌గా కూడా కొనసాగుతున్నారు. ఇప్పుడు ఆయన ఒక సంచలన ప్రకటన చేశారు. భార్యతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆయనే జెఫ్ బెజోస్. ఆయన భార్య మెకంజీ. ఆమె శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటారు. రచయిత్రి. వీరిరువురూ విడాకులు తీసుకోబోతున్నారు. ఈ విషయాన్ని ఇద్దరు ట్విటర్ ద్వారా తెలిపారు. అయితే విడిపోయిన తర్వాత కూడా వీరిద్దరూ తమ జాయింట్ వెంచర్లు, ప్రాజెక్టులలో కలిసి పనిచేయవచ్చు. అమెజాన్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అయిన జెఫ్ బెజోస్, ఆయన భార్య మెకంజీ 25 ఏళ్లుగా కలిసి ఉంటున్నారు. వీరికి నలుగురు పిల్లలు. జెఫ్ బెజోస్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడు. ఆయనకు అమెజాన్‌లో వాటా ఉండటం ఇందుకు కారణం. ఇటీవల ఈ కంపెనీ మైక్రోసాఫ్ట్‌ను వెనక్కు నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. అమెజాన్ స్థాపనలో మెకంజీ అందించిన ప్రోత్సాహం వెలకట్టలేనిదని, ఆమె చాలా సహాయపడ్డారని జెఫ్ బెజోస్ తెలిపారు. కాగా అమెజాన్ 1994లో ఏర్పాటైంది. ఇది తొలిగా ఆన్‌లైన్‌లో పుస్తకాలు విక్రయించేది. కంపెనీ ఏర్పాటైన తొలినాళ్లలో మెకంజీ అందులో అకౌంటింగ్ బాధ్యతలు చూసుకునేవారు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు అమెజాన్ విస్తరించింది. అందులో దొరకని వస్తువంటూ ఒక్కటి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. అలాంటి కంపెనీని నడిపిస్తున్న జెఫ్ బెజోస్.. ఇక ఒంటరి జీవితాన్నే గడపనున్నారు.

రూ.33,000 పైకి బంగారం

- **ఢిల్లీలో రూ.270 పెరిగిన 10 గ్రాముల పసిడి ధర**
- **దీంతో రూ.33,070లకు చేరిక**
- **రూ.410లతో పెరుగుదలతో రూ.40,510లకు కేజీ వెండి ధర**

న్యూఢిల్లీ: రూపాయి 70 స్థాయికి పడిపోవడంతో సురక్షిత సాధనమైన బంగారానికి దేశీయంగా డిమాండ్ పెరిగింది. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 0.16 శాతం పెరుగుదలతో 1,294.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.పసిడి దగదగమంటోంది. బంగారం ధరలు వరుసగా నాలుగో రోజు కూడా పెరిగాయి. రూ.33,000 మార్క్ పైకి చేరాయి. గురువారం పది గ్రాముల బంగారం ధర రూ.270 పెరుగుదలతో రూ.33,070కు ఎగసింది. దేశీ జువెలర్ల నుంచి డిమాండ్ పెరగడం ఇందుకు కారణం. వెండి ధరలు కూడా బంగారం బాటలోనే నడిచాయి. కేజీ వెండి ధర రూ.410 పెరుగుదలతో రూ.40,510కు చేరింది. పరిశ్రమ యూనిట్లు, నాణేపు తయారీదారుల



నుంచి డిమాండ్ ఎగయడం ధరల పెరుగుదలకు దోహదపడింది. రూపాయి 70 స్థాయికి పడిపోవడంతో సురక్షిత సాధనమైన బంగారానికి డిమాండ్ పెరిగింది. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్‌కు 0.16 శాతం పెరుగుదలతో 1,294.15 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఢిల్లీలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.270 పెరుగుదలతో రూ.33,070కు, 22 క్యారెట్ల బంగారం ధర రూ.270 పెరుగుదలతో రూ.32,920కు పెరిగింది. ఇక ప్రభుత్వ సార్వభౌమ పసిడి పథకంలో 8 గ్రాముల బంగారం ధర రూ.100 పెరుగుదలతో రూ.25,300గా నమోదైంది. వెండి ధర రూ.40,510 కి చేరగా.. వారాంతపు ఆధారిత డెలివరీ ధర రూ.367 పెరుగుదలతో రూ.39,700కి పెరిగింది. ఇక 100 వెండి నాణేల కొనుగోలు, అమ్మకం విషయానికి వస్తే.. కొనుగోలు ధర రూ.78,000 ఉండగా.. అమ్మకం ధర రూ.79,000గా నమోదయ్యింది.

డబ్బులు పోయాయా.. ఎందుకు.. ఎలా?



- **బ్యాంకు ఖాతాలో సొమ్ము ఉన్నట్టుండి మాయం**
- **మినిమమ్ బ్యాలెన్స్ లేకపోతే నెలవారీ కోత**
- **నిర్వహణ చార్జీల పేరుతోనూ మనకే వాతలు**
- **ఏటీఎంల వాడకంలో తస్మాత్ జాగ్రత్త..!**
- **ఖాతా బదిలీ.. లేదా రద్దు చేస్తేనే నయం**
- **వేరే బ్రాంచిలో డబ్బులు వేసినా చార్జీలు**
- **బ్యాంకు వినియోగదారులూ.. బహుపరాక్**

రోజు రోజుకీ.. ఆర్థిక విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఆర్థికరంగాల సేవలూ పూర్తిగా వాణిజ్యపంథాను అనుసరిస్తున్నాయి. ఈ క్రమంలో వినియోగదారునిపై అదనపు ఆర్థికభారం పడుతోంది. సాధారణ ఖాతాలు నిర్వహించే వినియోగదారులూ లేనిపోని బ్యాంకు చెల్లింపుల విషయంలో నష్టపోతున్నారు. అందుకు కారణం ఏంటో తెలుసుకుంటేనే మంచిది. ఈ రోజుల్లో బ్యాంకు అకౌంట్ లేనివాళ్ళను వేళ్ళపై లెక్కపెట్టొచ్చు. పేద, ధనిక, ఉద్యోగులు, కార్మికులు, చిన్నచితకా వ్యాపారస్తులు ఇలా అందరికీ బ్యాంకు ఖాతా ఉండటం అనివార్యమైంది. అయితే, మన ఖాతాలో అంతో ఇంతో మన ప్రమేయం లేకుండా డబ్బులు తగ్గిపోవడం.. ఇటీవల కాలంలో సర్వసాధారణంగా మారింది. ఇందుకు కారణం మినిమమ్ బ్యాలెన్స్ లేకపోవడమే అని బ్యాంకులు చెబుతున్నాయి. మరి దీనికి పరిష్కారం ఏమిటి? ఏ పరిస్థితుల్లో బ్యాంకులు సర్వీసు ఛార్జీల రూపంలో కోత విధిస్తున్నాయి? ఆయా విషయాలు ఏంటో సమగ్రంగా తెలుసుకుందాం!!

ఇటీవల కాలంలో.. తమ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బుల విషయంలో ఖాతాదారులకు రకరకాల ఆందోళనలు, అనుమానాలు తలెత్తుతున్నాయి. సర్వీస్ ఛార్జీల పేరుతో ఖాతాలోంచి కొంత డబ్బును ఎప్పటికప్పుడు బ్యాంకులు లాగేసుకోవడంతో ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనికి ఆయా బ్యాంకులు 'నిర్వహణ ఛార్జీలు' అంటూ సమాధానం చెప్పడం రివాజుగా మారింది. అయితే, ఇలా ఎందుకు జరుగుతుందనేది ఖాతాదారులు తెలుసుకోవాలి.

కనీస నిల్వలు ఉన్నాయా?!

తాజా పరిస్థితుల్లో బ్యాంకు పొదుపు ఖాతాలో కనీస నిల్వ ఉంచడం తప్పనిసరి. లేకుంటే రుసుముల భారం తప్పదు. అంతేకాదు, పరిమితికి మించి ఏటీఎం లావాదేవీలు నిర్వహించినా కొంత రుసుము భరించాల్సిందే.. బ్యాంకులు తీసుకున్న ఈ నిర?యాలతో ఖాతాదారుల్లో ఆందోళన మొదలైంది. అందుకే పెరిగిన సేవా రుసుములు భారం కాకుండా ఏం చేయాలో తెలుసుకుందాం.





ఏటీఎంలను ఎలా వాడాలి!

ఏటీఎం లావాదేవీల విషయంలోనూ బ్యాంకులు కొన్ని పరిమితులు విధించాయి. మెట్రో నగరాల్లో నెలకు మూడు, ఇతర నగరాల్లో ఐదు లావాదేవీలు ఉచితంగా లభిస్తాయి. కాబట్టి, ఉద్యోగులు తమ జీతం రాగానే తమ పొదుపు ఖాతా నుంచి ప్రతినెలా కొంత మొత్తాన్ని తన జీవిత భాగస్వామి, పిల్లల పేరుతో ఉన్న ఖాతాలోకి మళ్లించాలి. దీనికోసం ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను ఉపయోగించుకోవచ్చు. ఇతర బ్యాంకు ఖాతాలైతే నామమాత్రపు రుసుములు ఉంటాయి. అదే బ్యాంకు ఖాతాకు ఎలాంటి రుసుములూ ఉండవు. దీనివల్ల ఏటీఎం లావాదేవీలను గరిష్టంగా ఉపయోగించుకునే వెసులుబాటు లభిస్తుంది. ఎస్‌బీఐలో నెలవారీ సగటు నిల్వ రూ.25 వేల కంటే ఎక్కువ ఉన్నవారికి అపరిమిత లావాదేవీలు ఉచితంగా లభిస్తున్నాయి. ఇలాంటి అవకాశం మీ బ్యాంకు కల్పిస్తోందా? లేదా అనే విషయం.. ఒకసారి మీ బ్యాంకు శాఖను సంప్రదిస్తే మంచిది.

పాతపద్ధతే.. కొత్తగా

బ్యాంకు పొదుపు ఖాతాలో కనీస నిల్వ లేకుంటే అపరాధ రుసుము విధించే విధానం ఎప్పటి నుంచో ఉంది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో ఆంధ్రాబ్యాంకు, వైశ్యాబ్యాంకు ఇలా కొన్ని బ్యాంకులు పొదుపు ఖాతాలో కనీస నిల్వ అవసరం లేకుండా కొన్నేళ్లపాటు వెసులుబాటు కల్పించాయి. ప్రస్తుతం దీన్ని తీసేశాయి.

కనీస సగటు నిల్వ ఉండాల్సిందే!

కొన్ని బ్యాంకులు, నెలవారీ సగటు నిల్వను (యావరేజ్ బ్యాలెన్స్), మరికొన్ని త్రైమాసిక సగటు నిల్వలను ప్రాతిపదికగా తీసుకుంటు న్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెలవారీ కనీస సగటు నిల్వను పరిగణనలోకి తీసుకుంటుండగా, ఆంధ్రాబ్యాంకు మూడు నెలల సగటు నిల్వలను లెక్కిస్తోంది.

రద్దే.. బెటర్!

ఉద్యోగం, వ్యాపారం మరే ఇతర కారణాలవల్లనో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారారనుకోండి. అప్పుడు పాత ఖాతాను నిర్వహించకుండా ఉండే సందర్భాల్లో దాన్ని రద్దు చేసుకోవడమే మంచిది. లేకుంటే ఆ ఎకౌంట్‌లో డబ్బులు వేసిన ప్రతిసారీ అనవసరంగా అపరాధ రుసుముల భారం భరించాల్సి ఉంటుంది.

పట్టణ, గ్రామ ప్రాంతాల్లో అయితే?

పట్టణం, గ్రామ ప్రాంతాల్లో పొదుపు ఖాతా ఉన్నవారు నెలవారీ సగటు నిల్వ రూ.1,000 ఉంచినా చాలు. చాలా బ్యాంకుల్లో ఇదే విధానం అమల్లో ఉంది. అంటే, ఒక్కరోజు రూ.30,000 లేదా రెండు రోజులపాటు రూ.15,000, నాలుగు రోజులపాటు రూ.8,000, ఎనిమిది రోజులపాటు రూ.4,000 ఉన్నా చాలు. ప్రస్తుతం దాదాపు అన్ని బ్యాంకులూ కార్పొరేట్ శాలరీ అకౌంట్లను అందిస్తున్నాయి. ఈ తరహా ఖాతాల్లో ఎలాంటి సగటు నిల్వ అవసరం లేదు. పలు ప్రైవేటు బ్యాంకులు కనీస నిల్వ నిబంధన పాటించని ఖాతాదారులకు రూ.100 నుంచి రూ.600 వరకూ రుసుములు విధిస్తున్నాయి.



ప్రభాస్ 20వ టైటిల్



బాహుబలితో ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న హీరో ప్రభాస్. ఇప్పుడు 'సాహో' చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. త్వరలోనే ఈ సినిమా చిత్రీకరణ ముగియనుంది. ఇది పూర్తి కాగానే 'జిల్' ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు జాన్ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. అయితే ఈ చిత్రానికి విజువల్ ఎఫెక్ట్స్ అందించిన కమల్ కణ్ణన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సినిమా టైటిల్ జాన్ అని చెప్పేశారు. అంటే జాన్ టైటిల్ గురించి వినిపించిన వార్తలు నిజమే అని తెలుస్తుంది. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ చిత్రాన్ని గోపీకృష్ణా మూవీస్, యు.వి.క్రియేషన్స్ నిర్మించనున్నాయి.

అభిమానిలా ఫీలవుతా
- బోయపాటి శ్రీను



''ట్రైలర్‌లో రామ్ చరణ్ కటౌట్ చూస్తుంటే ఐరన్ మ్యాన్‌లా కనిపిస్తున్నాడు. ఆ బాడీలో ఈ రోజు ఉన్న మెచ్యూరిటీ నాలుగేళ్ల క్రితం లేదు. అందుకే పర్ఫెక్షన్ కోసం టైమ్ తీసుకోవాల్సి వచ్చింది. ఈ సినిమాకి ఇదే కరెక్ట్ టైమ్'' అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వంలో రాంచరణ్, కియరా అద్వాని జంటగా రూపొందిన చిత్రం 'వినయవిధేయరామ'. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''మా సినిమాలో రాముడు(రాంచరణ్) ఫ్యామిలీ పట్ల విధేయుడు. ఆ విధేయత ఏ స్థాయిలో ఉంటుందనేది మీరు సినిమాలో చూస్తారు. నేను చేసిన సినిమాలు 'భద్ర' నుండి నుండి 'వినయ విధేయ రామ' వరకు ఫ్యామిలీ ఇమోషన్స్ కే ఫస్ట్ ఫౌండేషన్ ఉంటుంది. ఆ తరవాతే సొసైటీ గురించి.. కథలో ఇంకా స్కోప్ ఉందనుకుంటే తక్కిన విషయాల గురించి ఆలోచిస్తా. మాస్, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు సినిమాలో ఒక కొత్త పాయింట్‌ని ఈ సినిమాలో చూపెట్టాం. అది ఆడియెన్స్‌కి రీచ్ అవుతుంది. అజర్ బైజాన్ సీక్వెన్స్ ప్రిపేర్ చేసుకుని రామ్ చరణ్‌కి చెప్పిన పప్పుడు, అప్పటికే 2 నెలల కన్నా ఎక్కువ టైమ్ లేదు. ఇప్పట్లో కష్టం అని నాకు తెలిసినా, మీరు చేసేస్తారు అని ఒక మాట అనేసి వెళ్ళిపోయా. ఆయన కూడా ఆ మాటని అలాగే తీసుకుని, నన్ను నమ్మాడు కాబట్టే అంతలా కష్టపడ్డాడు. 'వినయ విధేయ రామ' విజన్ నుండి విజువల్ వరకు ఉన్న మెయిన్ కనెక్టివిటీ రామ్ చరణ్.. ఆయన లేకపోతే ఇది సాధ్యపడేది కాదు. విలన్ పాత్ర కోసం వివేక్ ఒబెరాయ్‌గారినిని కలిసినపుడు ఆయన అన్న మొదటి మాట 'నేను చేయను'. నేను 'రక్త చరిత్ర' సినిమా చేశాను. మళ్ళీ అదే స్థాయి సినిమా అయితే తప్ప ..నేను ఆలోచించనండి అని చెప్పాడు. సరే సర్.. మీరు చేయకండి కానీ, ఒకసారి క్యారెక్టర్ వినండి అని చెప్పాను. అంతే విన్నాడో లేదో.. డేట్స్ ఇచ్చేశాడు. అదే కమిట్‌మెంట్ తో వచ్చాడు, చేసేశాడు.. వెళ్ళిపోయాడు. ఏ సినిమాకైనా ప్రొడ్యూసర్ దే ప్రధాన పాత్ర. జ్యూస్ నాదైనా మంచి గ్లాస్ ఉండాలి. అందుకే రామ్ చరణ్, నాకు %ఐ..%. గారైతేనే బెటర్ అని చెప్పడం జరిగింది. సినిమా ఈ రోజు ఇంత అద్భుతంగా వచ్చిందంటే అది ఆయన వల్లే పాసిబుల్ అయింది. ఏ హీరోతో సినిమా చేసినా, ఆ హీరోకి అభిమానిలా ఫీల్ అవుతా. చరణ్ కోసం సినిమా రాసుకున్నప్పుడు కూడా ఫ్రంట్ సీట్లో కూర్చుని చూస్తున్నట్టుగా ఫీలై కథ రాసుకున్నా. ప్రతి హీరోకి అదే చేస్తా. ఇది కూడా అలాంటి సినిమానే'' అన్నారు.



కీర్తి సురేష్ కొత్త చిత్రం షురూ

కీర్తిసురేష్ ప్రధాన పాత్రలో ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కొత్త చిత్రం గురువారం హైదారాబాద్‌లో ప్రారంభమైంది. నరేంద్ర దర్శకత్వంలో మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నందమూరి కల్యాణ్ రామ్ క్లాప్ కొట్టగా.. డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ సినిమాను కెమెరా స్విచ్చాన్ చేశార. దేవుడి పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ ఎస్.హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో...కీర్తి సురేష్ మాట్లాడుతూ ''తెలుగులో 'మహానటి' తర్వాత నటిస్తోన్న సినిమా. మహిళా ప్రధానమైన చిత్రంలో నటించడం చాలా హ్యాపీగా ఉంది. ప్రతి అమ్మాయికి కనెక్ట్ అయ్యే సినిమా. ఎక్కువ భాగం సినిమా యు.ఎస్‌లో చిత్రీకరణ జరుపుకోనుంది. డైరెక్టర్ నరేంద్ర మంచి కథను సిద్ధం చేశారు. తప్పకుండా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరవుతాననే నమ్మకం ఉంది'' అన్నారు. దర్శకుడు నరేంద్ర మాట్లాడుతూ ''2016 నుండి ఈ కథపై వర్క్ చేస్తున్నాను. అన్నీ ఎమోషన్స్ కలగలిపిన కథ ఇది. ఈ కథకు కీర్తిసురేష్‌గారు తప్ప మరేవరూ సూట్ కారు. 25 శాతం ఇండియాలో... 75 శాతం యు.ఎస్‌లో చిత్రీకరణ జరుగనుంది. ఏప్రిల్ లో యు.ఎస్.షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం. కుటుంబ కథా ప్రేక్షకులు సహా అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది. ఫిబ్రవరిలో షూటింగ్ స్టార్ట్ అవుతుంది'' అన్నారు. నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ '''మహానటి'తో కీర్తిసురేష్ తెలుగువారి హృదయాల్లో ఎంతటి స్థానం సంపాదించుకుందో తెలిసిందే. మహిళా ప్రధానమైన చిత్రం. ప్రతి అమ్మాయి తన జీవితంలో తమ జీవితంలో ఎక్కడో ఒకచోట ఇలాంటి సిచ్యువేషన్‌ను ఎదుర్కొనే ఉంటుంది. మహిళలకు కనెక్ట్ అవుతుంది. సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కల్యాణ్ కోడూరి మాట్లాఉతూ ''మహేష్ కోనేరు నిర్మాతగా చేస్తోన్న మూడో సినిమా ఇది. తప్పకుండా ప్రేక్షకులను మెప్పించే సంగీతం అందిస్తాను. కీర్తిసురేష్‌తో వర్క్ చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు.

తెలుగులో వివాదస్పద చిత్రం


మన్‌మోహన్ సింగ్

మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్ జీవిత కథను 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిష్టర్' అనే పేరుతో సినిమాగా తెరకెక్కించారు. ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. సినిమాను విడుదల నిషేధించాలనే వాదన బలంగా వినపడుతుంది. కాగా ఈ సినిమాను ఇప్పుడు తెలుగులో కూడా విడుదల చేయబోతున్నారట. మన్‌మోహన్ సింగ్‌కు మీడియా సలహాదారుగా వ్యవహరించిన సంజయ్ బారు రాసిన ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిష్టర్ ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలో మన్‌మోహన్ పాత్రధారిగా ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ నటించారు. విజయ్ రత్నాకర్ గుట్టె ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

టైటిల్ మార్పు

ఈ మధ్య సినిమాలు రిలీజ్‌కు ముందే వివాదాలకు కారణమవుతున్నాయి. ఎదుటి వారి మనోభావాలను దెబ్బ తీసేలా గానో.. అభ్యంతర కరమైన కాన్సెప్ట్‌లతోనో సినిమాల కంటెంట్ ఉంటే చాలు. అవి వివాదానానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. ఈ నెల 18న ఇమ్రాన్ హష్మీ హీరోగా నటించబోయే 'చీట్ ఇండియా' సెన్సార్‌కు వెళ్లింది. అయితే సినిమా టైటిల్ కథ, కథనాలను మిస్ లీడ్ చేసేలా ఉందని సెన్సార్ బోర్డ్ అభ్యంతరం చెప్పింది. దీంతో యూనిట్ తమ టైటిల్‌ను 'వై చీట్ ఇండియా'గా మార్చడానికి అంగీకరించింది. శ్రేయా ధన్వంతరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి సౌమిక్ సేన్ దర్శకుడు.


ఇమ్రాన్ హష్మీ

క్రేజీ హీరోతో క్యాథరిన్



చాలా గ్యాప్ తర్వాత హీరోయిన్ క్యాథరిన్ థ్రెసా తెలుగులో నటించనుంది. ఇంతకు ఏ హీరోతో అనుకుంటున్నారా!. తెలుగులో క్రేజీ హీరోగా పేరున్న విజయ్‌దేవరకొండతో. ఈ యువ హీరో తదుపరి చిత్రాన్ని క్రాంతి మాధవ్ దర్శకత్వంలో చేయబోతున్న సంగతి తెలిసిందే. కె.ఎస్.రామావు నిర్మించబోయే ఈ చిత్రం ఫిబ్రవరి నుండి రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనుంది. ఇందులో ఓ హీరోయిన్‌గా క్యాథరిన్‌ను ఎంపిక చేసుకున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. 'నేనేరాజు నేనేమంత్రి' సినిమా తర్వాత క్యాథరిన్ మరే తెలుగు సినిమాలో నటించలేదు. కాస్త గ్యాప్ తర్వాత ఆమె నటించబోయే తెలుగు చిత్రమిదే.



కేరళలో రానా

తెలుగు, తమిళ ప్రేక్షకులకే కాకుండా.. హిందీ చిత్ర ప్రేక్షకులకు కూడా రానా దగ్గుబాటి సుపరిచితుడైన హీరోయే. రానా చాలా చిత్రాలను సిద్ధం చేసుకుంటున్నాడు. కాగా.. ప్రభు సాల్మన్ దర్శకత్వంలో 70వ దశకంలో వచ్చిన బాలీవుడ్ మూవీ 'హథీ మేరీ సాథీ' సినిమాను తెలుగు, తమిళంలో రీమేక్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ఏనుగులతో నటించాలని రానా స్పెషల్ ట్రైనింగ్ కూడా తీసకుకున్నారు. షూటింగ్‌లో ఉండగా కాస్త అనారోగ్యానికి గురి కావడంతో షూటింగ్‌ను గ్యాప్ తీసుకున్న రానా.. ఇప్పుడు మళ్ళీ షూటింగ్‌లో పాల్గొన్నారు. ప్రస్తుతం కేరళ అడవుల్లో చిత్రీకరణ జరుగుతుంది. తమిళంలో కాడన్.. తెలుగులో అరణ్య అనే టైటిల్స్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో రానా యాభై ఏళ్ల వ్యక్తి పాత్రలో కనిపిసారట. తెలుగు, తమిళ వెర్షన్‌లో విష్ణు విశాల్ ఓ కీలక పాత్రలో నటిస్తుంటే.. హిందీ వెర్షన్‌లో పుల్కిత్ సమ్రాట్ అదే పాత్రలో నటిస్తున్నారు.

విశాల్‌పై కోర్టుకెక్కిన శింబు



తమిళ హీరో శింబు గతంలో అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో 'ఎఎఎ' అనే సినిమాలో నటించారు. ఆ సినిమా పెద్దగా సక్సెస్ కాలేదు. శింబు జోక్యం వల్లే తాను నష్టపోయానని నిర్మాత మైకేల్ రాయప్పన్ నిర్మాతల మండలిని ఆశ్రయించారు. అందువల్ల నిర్మాతల మండలి వివరణ కోరుతూ శింబుకు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శింబు నిర్మాతల మండలినిపై, నిర్మాత మైకేల్ రాయప్పన్‌పై కోర్టులో కేసు వేశారు. తనకు పారితోషకంగా 8 కోట్లు ఇవ్వాల్సి ఉంటే ఐదు కోట్లే ఇచ్చారని.. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని శింబు పేర్కొన్నారు. వాదనలు విన్న కోర్టు మైకేల్ రాయప్పన్‌ను పిటిషన్ వేయాల్సిందిగా కోరడమే కాకుండా.. నిర్మాతల మండలి అధ్యక్షుడు విశాల్‌కు లీగల్ నోటీసులు జారీ చేసింది. కేసును ఈ నెల 18కి వాయిదా వేశారు.

ఏప్రిల్‌లో 'దబాంగ్ 3'


సల్మాన్‌ఖాన్

సల్మాన్‌ఖాన్‌కి క్రేజ్ తెచ్చిన చిత్రాల్లో 'దబాంగ్' ఒకటి. ఈ సినిమాను సీక్వల్‌గా దబాంగ్ 2ను కూడా తెరకెక్కించారు. ఇప్పుడు 'దబాంగ్ 3'కి రంగం సిద్ధమవుతోంది. సల్మాన్‌ఖాన్ సోదరుడు అర్బాజ్ ఖాన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ప్రస్తుతం సల్మాన్‌ఖాన్ 'భారత్' సినిమా ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఇది ముగియగానే 'దబాంగ్ 3'ని స్టార్ట్ చేస్తారట. చిత్ర యూనిట్ లొకేషన్స్‌ను వెతుకున్నారు. ప్రీ ప్రొడక్షన్ ముగియడానికి సమయం పడుతుండటంతో సినిమా ఏప్రిల్‌లో స్టార్ట్ అవుతుందని అర్బాజ్‌ఖాన్ తెలిపారు. సోనాక్షి సిన్హా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రభుదేవా డైరెక్ట్ చేయబోతున్నారు. 'వాంటెడ్' తర్వాత సల్మాన్‌ఖాన్, ప్రభుదేవా కాంబినేషన్‌లో తెరకెక్కబోయే చిత్రమిదే.

ఈబీసీ కోటాపై సుప్రీంలో పిటిషన్

- ఆర్థిక స్థితిగతులు రిజర్వేషన్లకు మూలం కాదు
- పార్లమెంట్ ఆమోదించిన బిల్లు చెల్లదు
- సుప్రీం కోర్టులో కౌశల్ కాంత్ మిశ్రా పిటిషన్



న్యూఢిల్లీ, జనవరి 10: అగ్రవర్ణాల పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రిజర్వేషన్లకు కేవలం ఆర్థిక స్థితిగతులు మాత్రమే కారణంగా చూపలేమని, అందువల్ల ఆ బిల్లును రద్దు చేయాలని యూత్ ఫర్ ఈక్వాలిటీ ఆర్గనైజేషన్, కౌషల్ కాంత్ మిశ్రా ఈ పిటిషన్ దాఖలు చేశారు. రిజర్వేషన్లకు ఆధారంగా ఆర్థిక అసమానతలను చూపలేమని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగం మౌలిక స్వరూపానికి కొత్త బిల్లు విరుద్ధమని, 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని మించరాదని అన్నారు. పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న బిల్లుకు లోక్‌సభ, రాజ్యసభ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. బుధవారం సుమారు పది గంటల చర్చ తర్వాత రాజ్యసభ కూడా ఈ బిల్లును ఆమోదించింది. ప్రస్తుతం కుల ఆధారిత రిజర్వేషన్లు 50 శాతానికి అదనంగా ఈ పది శాతం ఈబీసీ కోటాను ప్రభుత్వం తీసుకురానుంది. పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా మెజార్టీ పార్టీలు ఈ బిల్లుకు మద్దతు తెలిపాయి.

అప్పట్లో ఇంద్రాసాహ్నీ పిటిషన్..

ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల వారికి పది శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న మోదీ సర్కార్ నిర్ణయంపై అనుకూల, ప్రతికూల వ్యాఖ్యలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి ఈ నిర్ణయాన్ని సవాలు చేయడానికి సీనియర్ అడ్వొకేట్ ఇందిరా సాహ్నీ సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. 1992లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా ఇదే ప్రయత్నం చేస్తే అప్పుడు కూడా ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఈమే కోర్టులో కేసు వేశారు. దీంతో అప్పట్లో సుప్రీంకోర్టు కుల ఆధారిత రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధించింది. కాగా, మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా అర్హులైన జనరల్ కేటగిరీ అభ్యర్థులు తమ అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఇందిరా సాహ్నీ అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును కోర్టులో సవాలు చేస్తామని, రాజ్యాంగ సవరణ బిల్లుపై కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అంశంపై ఆలోచిస్తున్నానని చెప్పారు. ఈ బిల్లు రిజర్వేషన్లను 60 శాతానికి తీసుకెళ్లి ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు అన్యాయం చేస్తుంది కాబట్టి దీనిని కోర్టు కొట్టేసే అవకాశం ఉంటుంది అని ఆమె చెప్పారు. 1992లోనూ అప్పటి పీవీ ప్రభుత్వం ఇలాంటి ప్రయత్నమే చేస్తే ఎంతో మంది రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారని, దీంతో తాను కోర్టులో సవాలు చేసినట్లు ఇందిరా సాహ్నీ వెల్లడించారు. ఆ కేసుపై ఎన్నో బెంచ్‌లు విచారణ జరపగా.. చివరిగా వెంకటాచలయ్య నేతృత్వంలోని బెంచ్ తీర్పును వెలువరించింది. ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుగా ఫేమసైన ఆ కేసులో తొమ్మిది మంది న్యాయమూర్తులు కలిగిన ధర్మాసనం రిజర్వేషన్ల పరిమితిని 50 శాతంగా నిర్ణయించింది. ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న పీవీ ప్రభుత్వ నిర్ణయాన్ని ఆ ధర్మాసనం కొట్టేసింది. వెనుకబాటుతనం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం కుల ఆధారంగా నిర్ణయిస్తారు తప్ప ఆర్థిక పరిస్థితులను బట్టి కాదు అన్నది ఆ తీర్పులోని ప్రధాన భాగం.

కోటాతో బీజేపీ గట్టెక్కేనా?



న్యూఢిల్లీ, జనవరి 10: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తురుప ుముక్కగా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు భావిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈబీసీ) రిజర్వేషన్ బిల్లు కమలం పార్టీని విజేతగా నిలుపుతుందా? లేదంటే పరాజితగా మారుస్తుందా?.. చివరి క్షణంలో ఆదరబాదరాగా తీసుకువచ్చిన ఈబీసీ బిల్లు అగ్ర కులాల మనస్సును గెలుచుకుంటుందా? లేదంటే వారి తిరస్కారానికి గురవుతుందా? అనే ప్రశ్నలకు మరి కొద్ది నెలల్లో సమాధానం లభించనున్నది. గతంలోనూ వివిధ సందర్భాల్లో ఆఖరి క్షణాల్లో బిల్లులను తీసుకువచ్చిన ఉదంతాలున్నాయి. కానీ, అవేమీ నాడు ఆయా పార్టీలకు ఓట్లు రాల్చలేదు. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ డిమాండ్ చేసిన జాట్ల విన్నపాన్ని నాటి యూపీఏ ప్రభుత్వం మన్నించింది. అలాగే మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ ఆ సామాజిక వర్గం చేసిన డిమాండ్‌కు అప్పటి మహారాష్ట్రలో కొలువుదీరిన కాంగ్రెస్-ఎన్సీపీ సంకీర్ణ సర్కారు ఆమోదముద్ర వేసింది.అయితే, ఇవేవీ తదుపరి ఎన్నికల్లో ఆ పార్టీలను గట్టెక్కించలేకపోయాయి. లోక్‌సభ, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించింది. జాట్లు, మరాఠాలు బీజేపీకే ఓటు వేసినట్లు ఆయా రాష్ట్రాల్లో పోలింగ్ సరళిని బట్టి తెలుస్తున్నది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాభవం తప్ప లేదు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంలోని కఠిన నిబంధనలపై అగ్ర కులాలు గుర్రుగా ఉన్నాయి. ఈ చట్టంలోని మార్గదర్శకాలను సవరించేందుకు బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఈ చట్టాన్ని సాకుగా తీసుకుని తమపై కేసులు నమోదు చేస్తూ దుర్వినియోగం చేస్తున్నారని వారు కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. మరోవైపు అట్రాసిటీ చట్టంలో జోక్యం చేసుకుని నిబంధనలు మార్చేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నదని, బీజేపీ హయాంలో తమపై అణిచివేత ధోరణి కొనసాగుతున్నదంటూ దళితులు కాషాయ పార్టీపై ఆగ్రహంగా ఉన్నారు. ఈబీసీ కోటా ద్వారా ఉత్తరాదిలో బలమైన వర్గాలైన జాట్లు, బనియాలు, పటేళ్లు, భూమిహార్, మరాఠా, బ్రాహ్మణ తదితర వర్గాల మనసు గెల్చుకునే దిశగా బీజేపీ పావులు కదిపింది. వీరిలో జాట్లు, పటేళ్లు, మరాఠాలు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ వర్గాలను ఓబీసీల్లో చేర్చితే .. ఇప్పటికే ఆ గ్రూపులో ఉన్న కులాలు ఆందోళనకు దిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో నొప్పించక.. తానొవ్వక రీతిలో కేంద్రం జనరల్ కేటగిరిలోనే ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించింది.

తలుపులు తెరిచే ఉన్నాయి..

- పాత మిత్రులకు ఆహ్వానం పలికిన మోదీ!


చెన్నై, జనవరి 10: మిత్రపక్షాలకు తమ తలుపులు తెరిచే ఉన్నాయంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన ఆసక్తిరేపుతోంది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తమిళనాడులో ఎన్డీఏను బలోపేతం చేయాలంటూ పాత మిత్రులకు మోదీ పిలుపునిచ్చారు. తమిళనాడుకు చెందిన ఐదు జిల్లాల్లోని బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముచ్చటించిన ఆయన ''సంకీర్ణ రాజకీయాల విజయాల''ను గుర్తుచేయడం విశేషం. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో 1990ల్లో జరిగిన పలు విషయాలను ప్రస్తావిస్తూ.. కమలం పార్టీ ద్వారాలు మిత్రపక్షాల కోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు.

2 దశాబ్దాల క్రితమే మొదలుపెట్టాం..

''ప్రాంతీయ ఆకాంక్షలకు 20 ఏళ్ల క్రితమే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన దార్శనికుడు అటల్‌జీ, సంకీర్ణ రాజకీయాలను విజయవంతంగా నడిపి భారత రాజకీయాల్లో సరికొత్త సంస్కృతిని ఆయన మొదలుపెట్టారు..బీజేపీ అటల్‌జీ చూపిన మార్గంలోనే పయనిస్తోంది'' అంటూ మిత్రపక్షాలను ఊరించే ప్రయత్నం చేశారు. అన్నాడీఎంకే, డీఎంకే, రజనీకాంత్ వంటి పార్టీలతో బీజేపీ జతకడుతుందా అంటూ ప్రశ్నించిన పార్టీ కార్యకర్త ప్రశ్నకు ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమాధానం ఇచ్చారు. ప్రాంతీయ పార్టీలను బీజేపీ చిన్నచూపు చూస్తోందన్న ఆరోపణలపై స్పందించిన ప్రధాని, ప్రాంతీయ పార్టీల ఆకాంక్షలను కాంగ్రెస్ ఏమాత్రం పట్టించుకోలేదని, కాంగ్రెస్ విధానానికి పూర్తి భిన్నంగా అటల్‌జీ చేశారన్నారు. కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ మోదీ ప్రాంతీయ పార్టీలను, వారి ఆకాంక్షలను, ప్రజలను సరిగ్గా చూడని కాంగ్రెస్ తమకు మాత్రమే అధికారంలో ఉండే హక్కులున్నట్టు భావిస్తుందన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో పీఎంకే, ఎండీఎంకేను కలుపుకుని 'రెయిన్‌బో కూటమి'గా బీజేపీ బరిలోకి దిగింది. కాగా బీజేపీతో చేతులు కలిపిన ఐదు పార్టీలు ఆతరువాతి కాలంలో కూటమిని వీడాయి. ఎన్డీఏ దృఢంగా ఉండటమనేది తమపై విశ్వాసానికి ప్రతీకగా మోదీ పేర్కొన్నారు. ''ఇదేం తప్పనిసరి కాదు. బీజేపీ సొంతంగా కూడా బలమైన మెజార్టీ సాధించింది, ప్రభుత్వాన్ని మిత్రపక్షాలతో కలిసి నడిపేందుకు మేము ఇష్టపడతాం. మా పాత మిత్రులకు ఎప్పుడూ తలుపులు తెరిచే ఉంటాయి'' అని మోదీ పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై ఉండటాన్ని నొక్కి చెప్పిన మోదీ, రాజకీయ అంశాలకంటే ప్రజలతో కలిసి ఉన్న కూటమే విజయం సాధిస్తుందన్నారు. ''సామాన్య పౌరుడితో ఉన్న బంధమే బలమైనది, కూటమి కంటే ప్రజల తో కనెక్ట్ అయి ఉండడంపైనే దృష్టిసారించాలి'' అని మోదీ స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అరక్కోణం, కడలూర్, క్రిష్ణగిరి, ఈరోడ్, ధర్మపురి జిల్లాలకు చెందిన పార్టీ కార్యకర్తలు మోదీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

అయోధ్యపై విచారణ వాయిదా

- కేసు నుంచి తప్పుకున్న జస్టిస్ లలిత్
- మరో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు: సీజే



న్యూఢిల్లీ, జనవరి 10: అయోధ్యలోని రామ జన్మభూమి- బాబ్రీ మసీదు స్థల వివాదంపై కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో వాదనలు వినేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ ధర్మాసనం గురువారం విచారణ ప్రారంభించింది. అయితే బెంచ్‌లో ఒకరైన జస్టిస్ యు.లలిత్ విచారణ నుంచి తప్పుకోవడంతో తదుపరి విచారణను జనవరి 29కి వాయిదా వేసింది. ఈ కేసులో కొత్త రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేస్తామని న్యాయస్థానం వెల్లడించింది. అయోధ్య కేసు విచారణ కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేత త్వంలో న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.ఎ. బోబ్డే, జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ యు.లలిత్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. గురువారం ఈ ధర్మాసనం వాదనలు ప్రారంభించింది. అయితే బెంచ్‌లో జస్టిస్ లలిత్ ఉండటంపై సీనియర్ న్యాయవాది రాజీవ్ ధవన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. జస్టిస్ లలిత్ గతంలో ఇదే కేసులో కల్యాణ్‌సింగ్ తరపున వాదించారు. దీంతో రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ లలిత్ సభ్యులుగా ఉండటంపై న్యాయవాది ధవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో జస్టిస్ లలిత్ విచారణ నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. అయోధ్య కేసులో జనవరి 29 నుంచి కొత్త ధర్మాసనం వాదనలు వింటుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని సున్నీ వక్ఫ్‌బోర్డు, నిర్మోహి అఖాడా, రామ్‌లల్లా మధ్య సమానంగా పంపిణీ చేయాలని 2010లో అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుతో సంతృప్తి చెందని పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వ్యక్తులు, ధార్మికసంస్థల తరపున 14 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వ్యాజ్యాలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. 2019 జనవరి మొదటివారంలో ధర్మాసనానికి నివేదిస్తామని గత ఏడాది అక్టోబరు 29న పేర్కొంది. విచారణ నిమిత్తం గత మంగళవారం రాజ్యాంగ దర్మాసనాన్ని ఏర్పాటుచేసింది.

హిందీ రాదని ఇమ్మిగ్రేషన్ ఆపేశారు!


- ముంబై విమానాశ్రయంలో ఘటన
- తమిళనాడువాసికి చేదు అనుభవం

ముంబై, జనవరి 10: హిందీ మాట్లాడటం రాదని చెప్పినందుకు గాను తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి పట్ల ముంబై విమానాశ్రయ అధికారి ఒకరు దురుసుగా ప్రవర్తించారు. ఇమ్మిగ్రేషన్ చెకింగ్ దగ్గర తనను నిలిపివేశారంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆవేదన వ్యక్తం చేశాడు. భాష రాని కారణంగా ఉన్నత స్థానంలో ఉన్న ఓ అధికారి ఇలా ప్రవర్తించడం ఎంత మాత్రం తగదని ఆయన పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన అబ్రహాం శామ్యూల్ మంగళవారం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లాడు. ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద ఆంగ్లం, తమిళంలో మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అక్కడి అధికారి అందుకు నిరాకరించారు. హిందీ మాట్లాడటం రాదంటూ అవమానకరంగా మాట్లాడారు. ఈ విషయాన్ని ఆయన ట్విటర్ ద్వారా విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌కు ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ''భారత్‌లో ఇప్పటి వరకు హిందీ మాట్లాడటం రాని కారణంగా ఇమ్మిగ్రేషన్ కౌంటర్ దగ్గర నిలిపివేయలేదు. ముంబయి విమానాశ్రయంలోని కౌంటర్ 33 వద్ద ఉన్న ఇమ్మిగ్రేషన్ అధికారి మాత్రం అలా చేశారు. నా పట్ల దురుసుగా ప్రవర్తించి అవమానపరిచే విధంగా మాట్లాడారు'' అంటూ పోస్ట్ చేశారు. ఈ విషయాన్ని వెంటనే శామ్యూల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సీనియర్ ఇమ్మిగ్రేషన్ అధికారులు స్పందించారు. ఆయనకు నాలుగు నిమిషాల్లోనే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ ఇచ్చి పంపించారు. ప్రయాణికుల పట్ల ఇలాంటి ప్రవర్తనను అంగీకరించబోమని, దీనిపై విచారణ చేస్తున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

రాజధానిలో ప్రాణ రక్షణ కరువు

- గతేడాది పెరిగిన హత్యలు
- నివేదిక విడుదల చేసిన ఢిల్లీ పోలీసులు





న్యూఢిల్లీ, జనవరి 10: ఢిల్లీలో ప్రాణ రక్షణ కరువైంది. సాక్షాత్తూ అధికారిక నివేదికలే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. రాజధాని ఢిల్లీలో గతేడాది జరిగిన నేరాల వివరాలను ఢిల్లీ పోలీసులు విడుదల చేశారు. రాజధానిలో ఘోరమైన నేరాల సంఖ్య గణనీయంగా త గ్గాయని, అరెస్టుల సంఖ్య పెరిగిందని పేర్కొన్నారు. అల్లర్ల సంఖ్య కూడా కాస్త తగ్గుముఖం పట్టినట్టు, దొంగతనాలు, అత్యాచారాల వంటి ఘోరాలు కాస్త తగ్గుముఖం పట్టాయన్నారు. నగరంలో నివసిస్తున్న ఈశాన్య భారతీయులపై కూడా నేరాలు తగ్గినట్టు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

'నేరాల రాజధాని'..

2017తో పోలిస్తే హస్తినలో హత్యల సంఖ్య పెరిగిందన్నారు. 2018లో 23 అల్లర్ల కేసులు నమోదయ్యాయి, 2017తో పోలిస్తే 54శాతం కేసులు తగ్గాయి, 2016తో పోలిస్తే వీటి సంఖ్య 70.89శాతం తగ్గడం విశేషమని హస్తిన పోలీసులు మీడియాకు వివరించారు. దొంగతనాల విషయానికి వస్తే 2,307 కేసులు నమోదు కాగా 2017తో పోలిస్తే ఇది 20.15శాతం తక్కువ. అయితే హత్యల సంఖ్య ఏకంగా 3.25శాతం పెరిగాయి. 2017లో 462 హత్యా కేసులు నమోదు కాగా 2018లో 477 కేసులు నమోదయ్యాయి. 2017తో పోలిస్తే 0.78శాతం తక్కువ అత్యాచార కేసులు నమోదయ్యాయి. మరోవైపు గత మూడేళ్లుగా అరెస్టుల సంఖ్య బాగా పెరిగిందని, దొంగతనం, హత్య, అత్యాచారాలు వంటి పలు నేరారోపణలపై గతేడాది మొత్తం 91,291 అరెస్టులు జరిగాయన్నారు. 2017లో 84,999 అరెస్టులు జరిగాయన్నారు. అన్ని మెట్రో నగరాలతో పోలిస్తే ఢిల్లీలో మొదటి నుంచి నేరాల సంఖ్య ఎక్కువే. ఈ కారణంగా 'నేరాల రాజధాని'గా అపప్రథ మూటగట్టుకుంది. అయితే నేరస్థులపై నేరారోపణలే తప్పితే పెద్దగా నేరం రుజువైన సందర్భాలు కూడా ఇక్కడ తక్కువగా ఉండడం హైలైట్.

నేరారోపణలు ఎదుర్కొంటున్న అత్యధికులు నిర్దోషులుగా విడుదలవుతుండడంపై దృష్టిసారించాలని నగర పోలీసులకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ గతేడాది సూచించారు. హస్తినలోని 30 పోలీస్ స్టేషన్లలో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించినట్టు, ఇందులో భాగంగా సుశిక్షుతులైన సిబ్బంది నేరాలపై దర్యాప్తు చేస్తుందన్నారు. విచారణ, దోషిత్వాన్ని రుజువు చేయడం, సకాలంలో క్రిమినల్ కేసులపై విచారణ జరిగేలా నాణ్యవంతమైన సేవలు వీరు అందించనున్నారు.



సైన్యంలో గేలకు అనుమతి లేదు

- స్పష్టంచేసిన జనరల్ రావత్

న్యూఢిల్లీ, జనవరి 10: సైన్యంలో స్వలింగ సంపర్కులను అనుమతించమని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ స్పష్టంచేశారు. స్వలింగసంపర్కంపై భారత సైన్యానికున్న సొంత చట్టాలనే తాము అనుసరించనున్నట్టు తెలిపారు. స్వలింగసంపర్కం నేరం కాదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై స్పందించాలన్న ప్రశ్నకు రావత్ గురువారం సమాధానం చెప్పారు. ''సైన్యంలో ఇది జరిగేందుకు మేం అనుమ తించం'' అని ఏటా జరిగే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో భాగంగా రావత్ వివరణ ఇచ్చారు. ''దేశంలోని చట్టాలకు అతీతంగా మేం లేము. కానీ భారత సైన్యంలో చేరినప్పుడు, కొన్ని హక్కులు, విశేషాధికారాలు దక్కుతాయి. కొన్ని మాకు వేరేలా ఉంటాయి. సైన్యం చాలా సంప్రదాయబద్ధంగా ఉంటుంది''అని చెప్పుకొచ్చారు. ఈ దుష్కార్యాన్ని సైన్యంలోకి అనుమతించేది లేదన్నారు.



జుట్టుకు రంగేసుకుని వెళ్లా

- అయ్యప్పను దర్శించుకున్నాను
- దళిత మహిళ మంజు వెల్లడి

తిరువనంతపురం, జనవరి 10: ప్రసిద్ధ శబరిమల ఆలయంలోకి జుట్టుకు తెల్ల రంగేసుకుని వెళ్లానని 36 ఏళ్ల మంజు అనే ఓ దళిత మహిళ వెల్లడించడం సంచలనం సృష్టిస్తోంది. మహిళ తాను వృద్ధ మహిళగా కన్పించేందుకు తలకు రంగేసుకొని మంగళవారం ఆలయంలోకి ప్రవేశించినట్లు పేర్కొంది. మహిళ ఫెడరేషన్ కార్యకర్త అయిన ఆమె ఈ మేరకు తన ఫేస్‌బుక్ ఖాతాలో పేర్కొంది. జుట్టుకు రంగేసుకొని ఆలయంలోకి 18 మెట్ల ద్వారా దర్శనానికి వెళ్లానని తెలిపారు. ఈమె గత అక్టోబరులో ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన 20 మంది మహిళల్లో ఒకరు కావడం గమనార్హం.

ప్రధానికి రాహుల్ రెండు ప్రశ్నలు!

న్యూఢిల్లీ, జనవరి 10: రఫేల్‌పై మాటలదాడిని మరింత ఉధృతం చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ.. ప్రధాని నరేంద్ర మోదీకి రెండు ప్రశ్నలను సూటిగా సంధించారు. సీబీఐ డైరెక్టరుగా తిరిగి నియామకమైన అలోక్ వర్మపై ఈ రెండు ప్రశ్నలున్నాయి. రఫేల్ యుద్ధవిమానాల కుంభకోణం మూలంగా ''అత్యంత చికాకు''గా ఉన్న ప్రధాని, సీబీఐ చీఫ్ వర్మపై వేటువేసేందుకు చాలా తొందరపడుతున్నారని రాహుల్ ఆరోపించారు. ''సీబీఐ చీఫ్‌ను తొలగించేందుకు అంత తొందరెందుకు? సెలెక్షన్ కమిటీ ముందు తన విషయాన్ని చెప్పుకునేందుకు సీబీఐ చీఫ్‌ను ఆయన ఎందుకు అనుమతించరు? దీనికి జవాబు: రఫేల్' అంటూ రాహుల్ ట్వీట్ చేశారు. రఫేల్‌కు సంబంధించే సీబీఐ చీఫ్‌ను రాత్రికి రాత్రే బలవంతంగా సెలవుపై పంపారా అన్న ప్రశ్నకు సమాధానంగా ''రఫేల్ నుంచి ప్రధానిని ఎవరూ కాపాడలేరు. సాక్ష్యం తెరిచే ఉంది'' అంటూ గురువారం రాహుల్ పేర్కొన్నారు. ''ప్రధాని అనిల్ అంబానికి రూ.30,000 కోట్ల సాయం చేశారన్నది సుస్పష్టం. ఇందులో ఒక్కింత కూడా అనుమానం లేదు. యావత్ జాతికి ఈ విషయం తెలిసివస్తుంది.''అని రాహుల్ వివరించారు.

8వ తరగతి వరకూ హిందీ తప్పనిసరి

- కస్తూరి రంగన్ కమిటీ ముసాయిదా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ జనవరి 10: దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఎనిమిదో తరగతి వరకూ హిందీ భాషను తప్పనిసరి చేయాలని కె.కస్తూరి రంగన్ కమిటీ సిఫా రసు చేసింది. ఈ మేరకు ముసాయిదా నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. నూతన విద్యా విధానం (ఎన్‌ఈపీ)పై గతంలో ప్రభు త్వం తొమ్మిది మంది నిపుణులతో కూడిన సభ్యులతో ఈ కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఆంగ్లం, హిందీ సహా ప్రాంతీ య భాషతో కలిపి మొత్తం మూడు సబ్జెక్టులు అమలు చేయడానికి రాష్ట్రాలు కట్టుబడి ఉండాల్సిందేనని కమిటీ సూచించింది. సామాన్య శాస్త్రం, గణితం వంటి సబ్జెక్టులకు ఏకరూప సిలబస్ ఉండొచ్చని సూచించింది. ప్రస్తుతం తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గోవా, పశ్చిమ్ బెంగాల్, అసోం వంటి రాష్ట్రాల్లో హిందీ తప్పనిసరి అనే నిబంధన లేదు.

17 రోజులు తిరిగి.. దొంగను పట్టింది!

- ముంబై మహిళ వీరోచిత గాథ

ముంబై, జనవరి 10: ఆమె ఒక వ్యక్తి చేతిలో ఏటీఎం మోసానికి గురైంది. అతగాడిని ఎలాగైనా పట్టుకోవాలని నాగమ్మ శపథం చేసింది. రెండు వారాల పాటు పట్టువదలని విక్రమార్కుడి చెల్లెల్లా అదే ఏటీఎంకు పదే పదే వెళ్లి.. ఎట్టకేలకు ఆ మోసగాడిని పట్టుకోగలిగింది. ఇదంతా దేశ ఆర్థిక రాజధాని ముంబై మహానగరంలో జరిగింది. బాంద్రా ఏటీఎంలో భూపేంద్ర మిశ్రా (36) అనే వ్యక్తి రెహనా షేక్ (35) అనే మహిళను మోసం చేశాడు. అతడు తరచు మోసాలు చేసే అలవాటున్నవాడు. అతగాడిపై ముంబై నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లలో ఏడు కేసులు నమోదయ్యాయి. డిసెంబరు 18వ తేదీన రెహనా పాయ్ హిల్ ప్రాంతంలోని తన ఆఫీసుకు వెళ్లేందుకు రైలు ఎక్కారు. తర్వాత బాంద్రా స్టేషన్ సమీపంలో ఉన్న ఏటీఎంకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకుందామనుకున్నారు. అక్కడ ఏదో సాంకేతిక లోపం ఉండటంతో ఏటీఎం నుంచి డబ్బులు రాలేదు. ఎంత ప్రయత్నించినా డబ్బులు రాకపోవడంతో బయట తలుపువద్ద వేచి చూస్తున్న నిందితుడు.. ఆమెకు సాయం చేస్తానని వచ్చాడు. ఆ తర్వాత అతడు వచ్చి కార్డు, పిన్ వివరాలు అన్నీ అడిగి.. వాటితో డబ్బులు తీసిచ్చాడు. అయితే.. ఆమె అక్కడినుంచి ఆఫీసుకు వెళ్లేసరికి తన ఖాతా నుంచి మరో రూ. 10వేలు డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వడాలా ప్రాంతానికి చెందిన రెహనా వెంటనే బాంద్రా ఏటీఎం వద్దకు వెళ్లగా.. అక్కడ ఆ వ్యక్తి లేడు. మళ్లీ రాకపోతాడా అనే ఉద్దేశంతో ఏకంగా 17 రోజుల పాటు ప్రతిరోజూ అదే సమయానికి అదే ఏటీఎం వద్దకు ఆమె వెళ్లసాగారు. ఎట్టకేలకు జనవరి 4వ తేదీన అతగాడు అదే ఏటీఎం బయట తలుపువద్ద రాత్రి 11.30 గంటల ప్రాంతంలో కనిపించాడు. దాంతో వెంటనే ఆమె అతడిని పట్టుకుని పోలీసులను పిలిచారు. పోలీసులు వచ్చి అతడిని తీసుకెళ్లి విచారించేసరికి.. అతగాడి మీద ఏడు కేసులు నమోదైనట్లు తెలిసింది.



2 వన్డేల నిషేధం

• సీఓఏ చీఫ్ రాయ్ సిఫారసు • చట్టపరమైన చర్యలపై ఎడుల్జీ దృష్టి





న్యూఢిల్లీ: ఓ టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌లపై రెండు వన్డేల నిషేధం విధించాలని గురువారం కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) చీఫ్ వినోద్ రాయ్ సిఫారసు చేశారు. కానీ సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ మాత్రం అంతటితో వదిలిపెట్టే ఆలోచనలతో లేదు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఈ అంశాన్ని బీసీసీఐ లీగల్ సెల్‌కు అప్పగించారు. స్త్రీలపై వ్యామోహంతో పాండ్య చేసిన వ్యాఖ్యలపై నలు మూలల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఈ ఇద్దరు క్రికెటర్లకు సీఓఏ షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. విమర్శలకు స్పందించిన ఆల్ రౌండర్ పాండ్య క్షమాపణలు చెబుతూ ఇకపై అలా ప్రవర్తించనని అన్నాడు. 'పాండ్య ఇచ్చిన వివరణ నాకు సంతృప్తికరంగా లేదు. అందుకే ఈ ఇద్దరు క్రికటర్లపై రెండు వన్డేల నిషేధానికి సిఫారసు చేశాను. ఏదిఏమైనా డయానా అభిప్రాయం తెలుసుకున్న తర్వాత తుది నిర్ణయం తీసుకుంటాం' అని రాయ్ అన్నారు. ఆ షోలో కొంత మంది స్త్రీలతో గడిపిన వివరాలను తెలుపుతూ అన్ని విషయాలను తన తల్లిదండ్రులతో పంచుకుంటానని పాండ్య చెప్పాడు. ఆస్ట్రేలియాలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ శనివారం జరిగే తొలి మ్యాచ్‌లో ప్రారంభం కానుంది. సినీ నిర్మాత కరణ్ జొహార్ నిర్వహించిన ఆ షోలో రాహుల్ కూడా పాల్గొన్నాడు. వివాదాస్పద వ్యాఖ్యలపై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని బీసీసీఐ కోరినప్పటికీ రాహుల్ ఇప్పటి వరకు స్పందించలేదు. 'పాండ్య, రాహుల్‌లపై నిషేధం విధించేలా చట్టపరమైన చర్యలకు డయానా చర్యలు తీసుకుంటున్నారు. కనుక ఆమె అభిప్రాయం తెలిపిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటారు. నాకు తెలిసినంత వరకు వాళ్ల వ్యాఖ్యలు చాలా దారుణం. అంగీకారయోగ్యం కాదు' అని రాయ్ అన్నారు.

ఈ వివాదంపై బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, కార్యదర్శి అమితాబ్ చౌదరి, కోశాధికారి అనిరుధ్ చౌదరి అభిప్రాయాలను కూడా ఎడుల్జి అడిగినట్లు తెలుస్తోంది. ఇద్దరు క్రికెటర్లపై నిషేధం విధించాలని కోరినట్టు చౌదరి ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అంతేకాదు ఆయన బీసీసీఐ సీఈఓ రాహుల్ జొహ్రీపై కూడా ధ్వజమెత్తారు. ఇటీవలే జొహ్రీ కూడా లైగింక వేధింపుల కేసును ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. 'సరైన విచారణ జరిపి ఇద్దరు క్రికెటర్లపై నిషేధం విధించాలి. ఒకవేళ జట్టుకు ఎంపికైతే వాళ్లను ఒకసారి ఆడనిచ్చి తర్వాత వారిపై నిషేధం విధించాలనుకుంటే ముందుగా లింగ సునితత్వం ప్రోగ్రాంను నిర్వహించాలి. అంతేకాదు ఈ ప్రోగ్రాంలో సపోర్ట్ స్టాఫ్‌తో పాటు జట్టు సభ్యులందరూ పాల్గొనాలి. అడ్వకేట్ కుమారి వీణ గౌడ సూచించిన విధంగా సీఈఓను కూడా ప్రోగ్రాంలో చేర్చాలి' అని అనిరుధ్ చెప్పారు. అయితే ఆ టీవీ షోలో పాల్గొనేందుకు ఆ ఇద్దరు క్రికెటర్లకు ఎవరు అనుమతి ఇచ్చారో కూడా విచారణ జరపాలని అనిరుధ్ చెప్పారు. 'కాంట్రాక్ట్‌లు పొంది ప్రాక్టీస్‌లో ఉండాల్సిన ఈ క్రికెటర్లు టీవీ షోలో ఎలా పాల్గొన్నారు. వాళ్లు అనుమతి తీసుకున్నారా? వారికి అనుమతి ఇచ్చారా? ఒకవేళ అనుమతి ఇచ్చివుంటే ఎవరిచ్చారు?' అని ఎడుల్జీని ప్రశ్నించారు. 'ఎంటర్‌టైన్‌మెంట్ షోలకు క్రికెటర్లను తీసుకెళ్లేందుకు స్పోర్ట్స్ జర్నలిస్టులు బయట ఎదురుచూస్తున్నారా? అని ప్రశ్నిస్తున్నాను' అని అనిరుధ్ అన్నారు. ఎందుకంటే క్రికెటర్లు ఏదైనా మీడియా సమావేశంలో పాల్గొనాలంటే బోర్డు అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాల్సివుంటుంది. మహిళల పట్ల ఈ క్రికెటర్లు అనుచితంగా మాట్లాడటం చూస్తుంటే బుకీల 'హనీ-ట్రాప్'లో వీరు పడ్డారేమో అనిపిస్తుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

మేరీకోమ్‌కు నంబర్ వన్ ర్యాంక్



• ఏఐబీఏ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: ఆరుసార్లు వరల్డ్ టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించిన భారత మహిళా బాక్సర్ ఎంసీ మేరీకోమ్ ప్రపంచ నంబర్ వన్ బాక్సర్‌గా నిలిచింది. గురువారం విడుదలైన ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఏఐబీఏ) తాజా ర్యాంకింగ్స్‌లో ఆమెకు అగ్రస్థానం లభించింది. మణిపూర్‌కు చెందిన ఈమె వరల్డ్ చాంపియన్‌షిప్స్ చరిత్రలో అత్యంత విజయవంతమైన బాక్సర్‌గా నిలిచింది. ఏఐబీఏ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో మేరీకోమ్ 1700 పాయింట్లతో 48 కిలోల కేటగిరిలో అగ్రస్థానంలో నిలిచింది. వచ్చే ఏడాది జరగనున్న టోక్యో ఒలింపిక్స్‌లో ఆమె 51 కిలోలకు మారనుంది. ఎందుకంటే ఒలింపిక్స్‌లో 48 కిలోల కేటగిరి లేదు. ముగ్గురు పిల్లల తల్లి మేరీ కోమ్ 2018ని పూర్తిగా ఎంజాయ్ చేసింది. పోలండ్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ఆమె స్వర్ణ పతకం గెలిచింది. బల్గేరియాలో జరిగిన ప్రతిష్ఠాత్మక స్ట్రాండ్జా మెమోరియల్ టోర్నీలో ఆమె రజత పతకాన్ని కైవసం చేసుకుంది. భారత ఇతర బాక్సర్లలో పింకి జంగ్ర 51 కిలోల కేటగిరిలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. ప్రపంచ మాజీ రజత పతక విజేత సోనియా లాథర్ గతేడాది నిరుత్సాహ పరచినప్పటికీ 57 కిలోల కేటగిరిలో రెండో ర్యాంక్ సాధించింది. ఆసియా గేమ్స్‌లో ఆమె ఒక్క పతకం కూడా గెలవలేదు. ప్రపంచ కాంస్య పతక విజేత సిమ్రన్‌జిత్ కౌర్ 54 కిలోల కేటగిరిలో నాలుగో స్థానంలో నిలిచింది. కొద్ది రోజుల క్రితం ఈమె జాతీయ చాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. తర్వాత ప్రపంచ మాజీ చాంపియన్ ఎల్ సరితా దేవి 16వ ర్యాంక్ సాధించింది. ఇండియా ఓపెన్ పసిడి పతక విజేత, ప్రపంచ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ 69 కిలోల కేటగిరిలో ఐదో స్థానం సంపాదించింది. పురుషుల ర్యాంకింగ్స్‌ను ఇంకా అప్‌డేట్ చేయలేదు.

జొకోవిచ్, హాలెప్‌కు టాప్ సీడ్స్

• ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్

మెల్‌బోర్న్: ప్రపంచ నంబర్ వన్ ప్లేయర్స్ నోవక్ జొకోవిచ్, సీమోనా హాలెప్‌లకు ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ టోర్నీలో టాప్ సీడ్స్ లభించాయి. ఈ టోర్నీ వచ్చే సోమవారం ప్రారంభం కానుంది. 23 మేజర్ టైటిళ్లు గెలిచిన అమెరికా నల్ల కలువ సెరెనా విలియమ్స్‌కు మహిళల విభాగంలో 16వ సీడ్ లభించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఫైనల్‌కు వెళ్లే క్రమంలో జొకోవిచ్ చిరకాల ప్రత్యర్థి రాఫెల్ నాదల్ డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్‌తో తలపడాల్సివుంటుంది. మరోవైపు యువ ఆటగాడు, నాలుగో సీడ్ అలెగ్జాండర్



జ్వెరెవ్ తొలి గ్రాండ్ శ్లామ్ టైటిల్ గెలవాలని పట్టుదలగా ఉన్నాడు. ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని సెర్బియా ఆటగాడు జొకోవిచ్ లక్ష్యంగా చేసుకున్నాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో సోమవారం జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌లో స్విస్ లెజెండ్ ఫెడరర్‌తో జొకోవిచ్ తలపడనున్నాడు. అయితే ఈ జోడీకి జ్వెరెవ్ నుంచి గట్టి పోటీ ఎదురుకానుంది. ప్రపంచ 5వ ర్యాంక్ ఆటగాడు జువాన్ మార్టిన్ డెల్ పొట్రో గాయం కారణంగా ఈ టోర్నీకి దూరమయ్యాడు. సౌతాఫ్రికాకు చెందిన కెవిన్ ఆండర్సన్‌కు ఐదో సీడ్ లభించింది. తొలి మ్యాచ్‌లో ఆరో సీడ్, గతేడాది ఫైనలిస్ట్ మారిన్ సిలిక్‌తో ఆండర్సన్ ఆడనున్నాడు.



విలువైన సెలబ్రిటీ జాబితాలో...
విరాట్ కోహ్లీ టాప్

• గతేడాది బ్రాండ్ వ్యాల్యూ 170.8 మిలియన్ డాలర్లు

ముంబై: దేశంలోని అత్యంత విలువైన సెలబ్రిటీ బ్రాండ్ జాబితాలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వరుసగా రెండోసారి అగ్రస్థానంలో నిలిచాడు. ఓ నివేదిక ప్రకారం కోహ్లీ బ్రాండ్ విలువ గతేడాది 18 శాతం పెరిగి 170.8 మిలియన్ డాలర్లకు చేరింది. 2018 నవంబర్ వరకు కోహ్లీ 24 కంపెనీల వస్తువులకు బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగాడు. గ్లోబల్ వ్యాల్యుయేషన్, కార్పొరేట్ ఫైనాన్స్ అడ్వైజర్స్ డఫ్ అండ్ ఫెల్ప్స్ గురువారం భారత అత్యంత విలువైన సెలబ్రిటీ జాబితాను విడుదల చేశారు. విరాట్ కోహ్లీ తర్వాత బాలీవుడ్ నటి దీపికా పడుకోన్ విలువైన సెలబ్రిటీగా నిలిచింది. గత నవంబర్ నాటికి 21 బ్రాండ్‌లకు అంబాసిడర్‌గా వ్యవహరించిన ఆమె వ్యాల్యూ 102.5 మిలియన్ డాలర్లుగా నిలిచింది.

వరల్డ్ కప్ జట్టులో
మార్పులుండవు

• వన్డే జట్టు వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ



సిడ్నీ: ఈ ఏడాది ఇంగ్లాండ్‌లో జరగనున్న వన్డే వరల్డ్ కప్‌కు భారత జట్టు దాదాపుగా ఖరారైందని టీమిండియా వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. అంతమాత్రాన జట్టులో ఎవ్వరి స్థానం పదిలం కాదని.. పేలవంగా ఆడితే చోటు కోల్పోవచ్చని హెచ్చ రించాడు. ఒకవేళ మార్పు లు తప్పనిసరి అయితే ఒకట్రెండు ఉండొచ్చని చెప్పాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లలో ఎవరైన పేలవ ప్రదర్శన కనబరిచినా, రానున్న రోజుల్లో ఎవరైనా గాయపడినా మార్పులు తప్పవని తెలిపాడు. 'ప్రస్తుతం ఎంపికైన 13 మంది సభ్యుల వన్డే జట్టే అటూ ఇటుగా వన్డే వరల్డ్ కప్‌లో ఆడుతుంది. రానునన రోజుల్లో ఆటగాళ్ల ఫామ్, గాయాల ఆధారంగా జట్టులో ఒకట్రెండు మార్పులు ఉండొచ్చు. గతేడాది అంతా మేము చాలా మ్యాచ్‌లు ఆడాం. కాబట్టి గాయాలు సహజం. ఫామ్, ఫిట్‌నెస్‌ను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. జట్టులో భారీ మార్పులు ఉండబోవని నేను అనుకుంటున్నాను. రాబోయే సిరీస్‌ల్లో ఆడే అందరూ వరల్డ్ కప్ ఆడతారన్న గ్యారంటీ లేదు. సిరీస్‌ల్లో ఆడే అవకాశం మాత్రం అందరికీ వస్తుంది' అని రోహిత్ అన్నాడు.

హైదరాబాద్‌లో తొలి వన్డే

• **విశాఖలో రెండో టీ20**

• **భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన ఖరారు**



హైదరాబాద్: ద్వైపాక్షిక సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా జట్టు ఈ నెలలో భారత్ పర్యటనకు రానుందని బీసీసీఐ తెలిపింది. ఈ పర్యటనలో ఇండియా, ఆస్ట్రేలియా జట్లు రెండు టీ20లు, ఐదు వన్డే మ్యాచ్‌లు ఆడతాయి. 24వ తేదీ బెంగళూరులో జరిగే తొలి టీ20తో భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన ప్రారంభమవుతుంది. మార్చి 13న ఢిల్లీలో జరిగే చివరి వన్డేతో ముగుస్తుంది.



మ్యాచ్‌లన్నీ డే/నైట్ మ్యాచ్‌లే. అయితే రెండో టీ20కి విశాఖపట్నం ఆతిథ్యమివ్వనుండగా.. వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. ఈ ఏడాది జరిగే ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్‌కు ముందు టీమిండియా ఆడే చివరి సిరీస్ ఇదే. చివరి వన్డే జరిగిన 10 రోజుల తర్వాత ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభమవుతుంది. ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే ఐపీఎల్ మే నెల మధ్యలో ముగుస్తుంది. వరల్డ్ కప్ ఇంగ్లాండ్‌లో మే 30న ప్రారంభమై జూలై 14న ముగుస్తుంది.

భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
ఫిబ్రవరి 24	తొలి టీ20	బెంగళూరు
ఫిబ్రవరి 27	రెండో టీ20	విశాఖపట్నం
మార్చి 2	తొలి వన్డే	హైదరాబాద్
మార్చి 5	రెండో వన్డే	నాగపూర్
మార్చి 8	మూడో వన్డే	రాంచీ
మార్చి 10	నాల్గో వన్డే	మొహాలీ
మార్చి 13	ఐదో వన్డే	ఢిల్లీ

పునః ప్రవేశం అంత సులువు కాదు

• **హైదరాబాద్ టెన్నిస్ స్టార్ సానియా**



బెంగళూరు: పోటీతత్వ టెన్నిస్‌లోకి పునః ప్రవేశం చేయాలని హైదరాబాద్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా సన్నద్ధమవుతోంది. అయితే పునః ప్రవేశం అంత సులువేమీ కాదని ఆమె పేర్కొంది. షోయబ్ మాలిక్, సానియా మీర్జా దంపతులకు ఇటీవలే తొలి సంతానం కలిగిన సంగతి తెలిసిందే. ఆరు గ్రాండ్ శ్లామ్ టైటిళ్లు గెలిచిన సానియా ట్రెయినింగ్‌ను ప్రారంభించింది. ఇక ముందు తాను అనేక పాత్రలు పోషించాల్సివుంటుందని 32 ఏళ్ల సానియా పేర్కొంది. 'ముమ్మందు నేను కొన్ని కీలకమైన పాత్రలు పోషించాలి. వాటిని చాలా వేగంగా కూడా చేయాలి. కొన్నేళ్లుగా ఒకరికి భార్యగా ఉంటున్న నేను ఇప్పుడు తల్లి పాత్ర కూడా పోషించాలి. అంతేకాకుండా టెన్నిస్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకోవాలి. ఇది అంత సులువేమీ కాదని నాకు తెలుసు. కానీ ప్రయత్నించడంలో తప్పు లేదు. మళ్లీ క్రీడల్లోకి రావడమే నా తుది లక్ష్యం. బహుశా ఈ ఏడాది చివరికల్లా అది జరుగుతుందని భావిస్తున్నా. 2020లో పునః ప్రవేశం చేస్తానని గతంలోనూ చెప్పాను. దానికి ఒక కారణముంది. నేను ఎటువంటి ఒత్తిడికీ గురికాకూడదన్నదే ఆ కారణం' అని సానియా చెప్పింది. కుమారుడు ఇజ్‌హాన్‌కు జన్మనిచ్చిన తర్వాత తన జీవితమే మారిపోయిందని సానియా తెలిపింది. 'పసి పల్లలు ఇంట్లో ఉంటే ఆ జీవితమే వేరు. మనకు పెద్దగా ప్రాధ్యానతలుండవు. మొన్నటి వరకు స్వార్థంగా జీవించాను. నా ఫిట్‌నెస్‌పై, విశ్రాంతిపై, వర్క్‌పై దృష్టి పెట్టాను. పసి పిల్లలు ఇంట్లో ఉంటే మనదంటూ ఏదీ ఉండదు. ప్రతీది ఆ పిల్లల కోసమే ఆలోచిస్తాం. మాతృత్వం అంటే అదే. ఇప్పుడు నా జీవితం నిస్వార్థంగా మారింది' అని ఓ ప్రైవేటు కార్యక్రమంలో సానియా పేర్కొంది.

బీసీసీఐ అంతర్గత ఫిర్యాదు కమిటీ చీఫ్‌గా రాజ్‌లక్ష్మి నియామకం



ముంబై: బీసీసీఐ నలుగురు సభ్యుల అంతర్గత కమిటీ చీఫ్‌గా రాజ్‌లక్ష్మి అరోరా గురువారం నియమితులయ్యారు. ఈమె లైంగిక వేధింపులు వంటి ఫిర్యాదులను పరిశీలిస్తుంది. ఈ కమిటీలో సబా కరీమ్, రూపవతి రావ్, వీణా గౌడ్ కూడా సభ్యులుగా ఉన్నారు. లాయర్ కరీనా క్రిపలాని పదవీ కాలం ముగియడంతో ఆమె రాజీనామా చేసింది. దీంతో కరీనా స్థానంలో రాజ్‌లక్ష్మిని బీసీసీఐ నియమించింది. రాజ్‌లక్ష్మి ప్రస్తుతం బీసీసీఐ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ బృందానికి ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తోంది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న బీసీసీఐ సీఈఓ రాహుల్ జొహ్రీని విచారించిన ముగ్గురు సభ్యుల కమిటీలో గౌడ కూడా ఉన్నారు. తర్వాత జొహ్రీకి క్లీన్ చిట్ వచ్చింది. కానీ జొహ్రీకి 'లింగ సున్నితత్వ ప్రోగ్రాం' ఇవ్వాలని గౌడ తన నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుత అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏడాది పాటు పనిచేస్తుంది.

సెమీస్‌లో ఒడిశా, యూపీ

• **హరియాణా, పంజాబ్ కూడా**

• **ఖేలో ఇండియా అండర్-17 హాకీ**

ముంబై: ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2019 అండర్-17 బాలుర హాకీ పోటీల్లో ఒడిశా, ఉత్తరప్రదేశ్, హరియాణా, పంజాబ్ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. అండర్-21 పురుషుల పోటీల్లోనూ పంజాబ్, యూపీ జట్లు విజయం సాధించాయి. అండర్-17 కేటగిరి గ్రూప్-ఎలో ఉత్తరప్రదేశ్ జట్టు 5-3తో మహారాష్ట్ర జట్టును ఓడించింది. మరోవైపు ఒడిశా జట్టు 3-1తో ఢిల్లీపై గెలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఒడిశా విజయం సాధించింది. ఇక గ్రూప్-బిలో పంజాబ్ 9-4తో జార్ఖండ్‌ను చిత్తు చేసింది. పంజాబ్ జట్టుకు ఇది రెండో విజయం. దీంతో ఆ జట్టుకు ఆరు పాయింట్లు లభించాయి. గ్రూప్-బిలో జరిగిన చివరి మ్యాచ్‌లో హరియాణా 4-0తో చండీఘర్‌పై గెలిచింది. దీంతో 9 పాయింట్లతో నిలిచిన హరియాణా జట్టు సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది.

ఇక అండర్-21 పురుషుల కేటగిరి విషయానికొస్తే.. సెమీస్‌కు అర్హత సాధించిన తొలి జట్టుగా పంజాబ్ నిలిచింది. గ్రూప్-ఎలో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 4-1తో ఢిల్లీని చిత్తు చేసింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ పంజాబ్ జట్టు గెలిచింది. గ్రూప్-ఎలో ఉత్తరప్రదేశ్ జట్టు 2-0తో చండీఘర్‌పై గెలిచి సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. అండర్-17 కేటగిరి సెమీఫైనల్ మ్యాచ్‌లు శనివారం జరగనుండగా.. అండర్-21 పురుషుల కేటగిరి సెమీఫైనల్స్ ఆదివారం జరుగుతాయి.

KHELO INDIA YOUTH GAMES
PUNE, MAHARASHTRA, 2019



గురువారం ముంబైలో జరిగిన రమాకాంత్ అచ్రేకర్ సంతాప సభలో చిన్ననాటి కోచ్‌ను స్మరించుకున్న భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at M/s JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press D.no.5-625, Atamkur village, Mangalagiri Mandal, Guntur District, Andhra Pradesh, And Published at H.No. 23-3-46, 1st Floor, Katamaraju vari veedhi, Amaravathi road, Naidu pet, Guntur (District)ANDHRAPRADESH - 522002. Editor : VUPPARI RAMESH KUMAR, RNI Reg No. APTEL/2016/73939, Phone No. 040-46519999, e-mail id: editor@manamnews.com, Web Edition www.manamnews.com